
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
ఆదివారం 2 మార్చి 2025 | 5





మంచు తెరలు..

పగలు ఎండలు దంచేస్తుంటే, అర్ధరాత్రి దాటాక ఉదయం దాకా దట్టమైన మంచు కురుస్తోంది. ఈ మిశ్రమ వాతావరణ పరిస్థితులు కొంతమందిని ఇబ్బంది పెడుతున్నాయి. ఇంకా కొద్దిరోజులు ఈ పరిస్థితి కొనసాగేలా ఉంది. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం తీపర్రులో గ్రామంలో గోదావరి చెంత కనిపించిన మంచు దృశ్యాలివి.. - పెరవలి

చికెన్ తిందాం..రా!

చికెన్ లేదా.. నాకు అన్నం వద్దంటూ మారాం చేయని పిల్లలు అరుదు. నాకు లెగ్ పీస్ కావాలమ్మా అంటూ ముందే రిజర్వు చేసుకునే టీనేజర్లు.. చికెన్ ఫ్రై చేయనా, కర్రీనా అంటూ కిచెన్‌లోంచే ఆఫర్ ఇచ్చే ఇల్లాలు.. ఈలోగా హోటల్‌కెళ్లి దమ్ బిర్యానీ తిందామా అంటూ ఇంటాయన బంపర్ ఆఫర్. ఆదివారం వచ్చిందంటే.. మాంసాహారం తినే వారి ప్రతి ఇంట్లో ఓ చికెన్ మేళానే. పండగన్నా, ఫంక్షనన్నా చికెన్ వెరైటీస్‌తో మరో మెగా మేళా. బలం కోసం గుడ్లు తినండి.. ఓ సలహా. పౌష్టికాహారంలో గడ్డుదే తొలి మెనూ. ఒక్కే ఒక్క భయం అన్నిటినీ దూరం చేసేసింది.

బర్డ్‌ఫ్లూ వైరస్‌తో కోడిమాంసం, గుడ్ల వ్యాపారాన్ని కుప్పకూలేలా చేసింది. వైరస్‌తో కోళ్లు చనిపోయిన మాట వాస్తవం. కానీ దాని ప్రభావం మనుషులపై చూపలేదు. కేవలం భయాందోళనే చికెన్‌ను దెబ్బతీసింది. నెలరోజుల్లో కోట్లలో వ్యాపారం దెబ్బతింది. ఇప్పుడిప్పుడే మళ్లీ జనం చికెన్ వైపు మళ్లేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పరిశ్రమ కూడా ఉచిత చికెన్ మేళాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడానికి అనేక పట్టణాల్లో విస్తృత ప్రచారం చేసింది. మరి ఈ ఆదివారం ఆ ప్రభావం ఏ మేరకు ఉంటుందో చూడాలి.

- ఊరూవాడా పౌల్ట్రీ రంగం ప్రచారం
- బర్డ్‌ఫ్లూతో కోట్లతో నష్టపోయిన పరిశ్రమ
- ఉచిత మేళాలు గట్టెక్కిస్తాయనే ఆశలు
- కోలుకుంటేనే అనుబంధ వ్యాపారాలకూ జోరు
- ప్రస్తుతానికి మటన్, చేపలు, రొయ్యలదే హవా
- వేడుకల్లో 'మటన్' మెనూతో పెనుభారం
- చికెన్ ఉంటేనే నాన్‌వెజ్ ప్రియులకు పండగ



సండే 'స్పెషల్'



పిఠాపురంలో చికెన్ మేళా

(అమలాపురం/అనపర్తి/పిఠాపురం/మండపేట/కొవ్వూరు-ఆంధ్రజ్యోతి)

బర్డ్‌ఫ్లూ వ్యాప్తి ప్రచారంతో దాదాపు నెల రోజులపాటు కోడిమాంసం, గుడ్ల వ్యాపారం పడిపోయింది. అధికారులు, వైద్యులు, పరిశ్రమకు చెందినవారు ఎంత అవగాహన కల్పించినా జనం చికెన్ తినేందుకు ఇష్టపడలేదు. కనీసం గుడ్లు తినాలన్నా భయపడే రోజులు కొనసాగాయి. ఇది పౌల్ట్రీ పరిశ్రమకు పెద్ద దెబ్బ. కేవలం భయాందోళన వల్ల జరిగిన భారీ నష్టమిది. పేదవర్గాలు సైతం కోడిమాంసం తినేందుకు ముందుకు రాలేదంటే దాని ప్రభావం ఏమేరకు చూపిందో అర్థం చేసుకోవచ్చు. తూర్పుగోదావరి జిల్లాలోని పెరవలి మండలం బర్డ్‌ఫ్లూ లక్షణాలతో కోళ్లు పెద్దఎత్తున చనిపోవడంతో ఈ విషయం తొలుత బయటకొచ్చింది. ఆ తర్వాత ఈ జిల్లాలో మరికొన్ని పౌల్ట్రీ ఫారాల్లోనూ బర్డ్‌ఫ్లూ లక్షణాలతో కోళ్లు చనిపోవడంతో వెంటనే కోడిమాంసం, గుడ్లు తినొద్దంటూ జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కాకినాడ జిల్లాలో కూడా కొన్నిచోట్ల ఇదే పరిస్థితి తలెత్తడంతో కాకినాడ జిల్లాతోపాటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోనూ కొంతకాలం చికెన్ తినొద్దంటూ కలెక్టర్లు ఆదేశించారు. ఇందులో కోనసీమ జిల్లాలో ఈ ప్రభావంతో చనిపోయిన కోళ్లు పెద్దగా లేవు. అలాగే ఈ మూడు జిల్లాల్లో పౌల్ట్రీల్లో పనిచేసే కూలీలకు శ్వాబ్ పరీక్షలు చేస్తే ఏ ఒక్కరికీ బర్డ్‌ఫ్లూ లక్షణాలు సోకలేదు. దీంతో వెంటనే కోడిమాంసం, గుడ్లు తినొచ్చంటూ అధికారులు, వైద్యులు చెబుతూ వచ్చారు. కానీ జనం మాత్రం చికెన్ అంటే భయపడుతూనే వచ్చారు. పౌల్ట్రీ పరిశ్రమ పెద్దలు కూడా రంగంలోకి దిగి ఉచిత చికెన్ మేళాలు నిర్వహించి ప్రచారం చేశారు. ఆయా కార్యక్రమాలకు జనస్పందన కూడా బావుంది. చికెన్, గుడ్ల కోసం అన్నిచోట్లా పెద్దఎత్తున జనం ఎగబడ్డారు. ఈ అవగాహన ఎంతవరకు ఫలిస్తుందో, దాని ప్రభావం ఏమేరకు ఉంటుందో వేచిచూడాలి.

చికెన్ షాపులు వెలవెల

బర్డ్‌ఫ్లూ ఎఫెక్టుతో చాలా చికెన్ షాపులు మూతపడ్డాయి. గత వారం నుంచే చాలామంది చికెన్ దుకాణాల్లో ఓమోస్తరుగా అమ్మకాలు చేస్తున్నారు. కొవ్వూరు పట్టణంలో సాధారణంగా 15 రోజుల్లో పది వేల కోళ్లు విక్రయించేవాడు. గత పక్షం రోజుల్లో కేవలం 500 కోళ్లను మాత్రమే విక్రయించాడంటే చికెన్ అమ్మకాలు ఏ స్థాయిలో పడిపోయాయో అర్థంచేసుకోవచ్చు. పిఠాపురంలో మరో చికెన్ షాపు నిర్వాహకుడు మాట్లాడుతూ తాను ఆదివారం నాడు 2వేల కిలోల వరకూ అమ్మేవాడినని, అది వంద కిలోలకు పడిపోయిందని వాపోయాడు. అలాగే కిలో చికెన్ స్కిన్‌లెస్ నెల కిందట రూ.220 వరకు విక్రయించగా, ప్రస్తుతం ప్రాంతాన్ని బట్టి రూ.150 నుంచి రూ.180 మధ్య అమ్ముతున్నారు. అయినాగానీ అమ్మకాలు అంతంత మాత్రమే.

ఫంక్షన్లలో మటన్ మెనూలు

బర్డ్‌ఫ్లూ కారణంగా చికెన్ విక్రయాలు తగ్గి అంతా మటన్, చేపలు, రొయ్యలు, పీతల వంటి వాటిపై పడ్డారు. ఫలితంగా వాటి ధరలు పెరిగిపోయాయి. మటన్ కిలో రూ.800 ఉండే ధర రూ.వెయ్యికి, కొన్నిచోట్ల రూ.1100 వరకు పెరిగిపోయింది. చేపలు, రొయ్యల ధరలూ అదేవిధంగా పెరిగిపోయాయి. ఇది పెళ్లిళ్ల సీజన్. వివాహ రిసెప్షన్లు ఉంటే నాన్‌వెజ్‌తోనే వంటకాలు సిద్ధం చేస్తున్నారు. ఇతర ఫంక్షన్లలోనూ నాన్‌వెజ్ వంటకాలే ఉంటున్నాయి. వీటి అన్నిటిపైనా చికెన్ ప్రభావం పడింది. ఆయా వేడుకల మెనూలో చికెన్‌ను కొందరు నామ మాత్రంగా పెడితే, కొందరు పూర్తిగా మటన్, చేపలు, రొయ్యల వంటకాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. వెళ్లిన వారు కూడా మటన్‌పైనే మక్కువ చూపడంతో ఆమేరకు తగిన పరిమాణంలో సిద్ధం చేయాల్సి వస్తోంది. దీంతో ఆయా వేడుకల ఖర్చు తడిసిమోపెడవుతోంది. ఇది ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్టుంది.



పుట్టగొడుగులకూ డిమాండే

అమలాపురం రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ దెబ్బకు చికెన్ వినియోగదారులు తగ్గిపోయారు. మార్కెట్‌లో ఉదయం వేలాడదీసిన కోళ్ల అమ్మకాలు రాత్రి అయినా పూర్తికాని పరిస్థితి. మార్కెట్‌లో ప్రస్తుతం చేపలు, మటన్ అమ్మకాలు పెరిగినమాట వాస్తవమే. గోదావరి, సముద్రపు చేపల ధరలతోపాటు మటన్ రేటు కూడా పెరిగిపోవడంతో అందరూ కొనుగోలు చేయలేని పరిస్థితి. దీంతో మాంసాహార ప్రియులుతక్కువ ధరకు దొరికే మష్రూమ్స్ (పుట్టగొడుగులు) లేదా పన్నీర్ వంటకాలపై దృష్టి సారించారు. మార్కెట్‌లో పన్నీర్ రూ.90 నుంచి రూ.100కు విక్రయిస్తున్నారు. మష్రూమ్స్ ప్యాకెట్ రిటైల్‌గా రూ.20కే దొరుకుతుండడంతో మాంసాహార ప్రియులు తమ వంటకంగా పుట్టగొడుగులను ఎంచుకున్నారు. ఈ రెండు వంటకాలు వేటికవే ప్రత్యేకం కావడంతో ఆదివారం తక్కువ ఖర్చుతోనే విందు చేసుకుంటున్నారు.

హోటళ్లలో బెటర్.. ఫాస్ట్‌ఫుడ్‌లన్నీ మటాష్

సాధారణంగా హోటల్ ఫుడ్ ఇష్టపడేవారంతా చికెన్‌తో పదుల సంఖ్యలో చేసే వెరైటీల కోసమే వెళతారు. బిర్యానీల్లోనూ ఎన్నో వెరైటీలు. బర్డ్‌ఫ్లూతో చికెన్ వంటకాలపై తీవ్ర ప్రభావం పడింది. ఇప్పుడిప్పుడే చికెన్ బిర్యానీలు, వంటకాలకు కాస్త గిరాకీ తగులుతోందని, అది కూడా నాణ్యతలో పేరున్న హోటళ్లకే పరిమితమని ఒక హోటల్ నిర్వాహకుడు తెలిపాడు. కేవలం చికెన్, గుడ్లతోనే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు నడుస్తాయి. అవన్నీ నెలరోజులుగా బేరం లేక మూలనపడ్డాయి. బహుశా వారం పదిరోజుల్లో సాధారణ స్థితి నెలకొంటుందని వారు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

గుడ్డిలో మెల్ల... గుడ్డు ధర

బర్డ్‌ఫ్లూ ప్రభావంతో కోళ్ల పరిశ్రమ అతలాకుతలం అవుతున్న తరుణంలో గుడ్ల ఎగుమతులపై తొలుత ప్రభావంపడినా మెల్లమెల్లగా ఎగుమతులు ఊపందుకున్నాయి. నెలరోజుల కిందట రూ.4 దిగువకు చేరుకున్న గుడ్డు ధర ప్రస్తుతం రూ.4.80కు చేరుకోవడంతో రైతులు ఊపిరిపీల్చుకుంటున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చాలా ప్రాంతాల్లో కోళ్లకు నష్టం లేకపోయినా వినియోగం తగ్గడంతో తీసేయాల్సిన లేయర్ బ్యాచ్‌లు బయటకు వెళ్లక రైతులపై భారం పడుతోంది.

చికెన్ మేళాలు ఉపకరిస్తాయా..

కోడిమాంసం కూర గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో ఉడికించి తింటే ఒకవేళ వైరస్ లక్షణాలు ఉన్నా ఏమీ కాదని వైద్యులు చెబుతున్నారు. గుడ్లు కూడా పూర్తిగా ఉడకబెట్టుకుని లేదా వండుకుని తినొచ్చని చెప్పారు. పౌల్ట్రీ సంఘాలు కూడా రంగంలోకి దిగి ఉచిత చికెన్, గుడ్లు మేళాలు నిర్వహించగా, జనం వాటి కోసం పెద్దఎత్తున ఎగబడ్డారు. ఇది పూర్తి సానుకూల పరిస్థితి ఉంటుందనే ఆశాభావంతో వారంతా ఉన్నారు.





జూనియర్ ఇంటర్ పరీక్షల సందర్భంగా రాజమహేంద్రవరం ఎస్‌కేఆర్ కాలేజీ పరీక్షా కేంద్రంలో తమకు కేటాయించిన పరీక్షా గదిని పరిశీలిస్తున్న విద్యార్థులు.. ఆఖరి నిమిషంలో విద్యార్థినుల ఉరుకులుపరుగులు

ఇంటర్ పరీక్షలు.. మొదటి రోజు ప్రశాంతం

రాజమహేంద్రవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా ముగిశాయి. శనివారం జనరల్ విద్యార్థులకు ద్వితీయ భాష పేపర్ 1, 2, వొకేషనల్ విద్యార్థులకు జనరల్ ఫౌండేషన్ కోర్సు పరీక్ష నిర్వహించారు. జనరల్ విభాగంలో 576, వొకేషనల్ 197 మంది గైర్హాజరయ్యారని ఇంటర్ విద్య జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. 51 పరీక్షా కేంద్రాల్లోను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ

773 మంది గైర్హాజరు

జూనియర్ కళాశాలలో పరీక్షల తీరును కలెక్టర్ ప్రశాంతి పరిశీలించారు. విద్యార్థులకు తాగునీరు, అత్యవసర మందులు తదితర అంశాలపై ఆరా తీశారు. తొలి రోజున ప్రశ్నపత్రం కాస్త సులభంగానే ఉందని కొందరు విద్యార్థులు చెప్పారు. షరా మామూలుగానే ఉదయం విద్యార్థులకు ఉరుకులు, పరుగులు తప్పలేదు. విద్యార్థులను తల్లిదండ్రులు ఉత్సాహపరిచి పరీక్షకు పంపించారు.

ఫించను.. అదే జోరు

12గంటల్లో 96శాతం పంపిణీ
పింఛను పంపిణీ చేసిన కలెక్టర్



బూరుగుపూడిలో ఫించన్లు పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం/కోరుకొండ మార్చి1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచీ ఠంచనుగా పింఛను పంపిణీ జరుగుతోంది. ప్రతి నెలా అదే జోరుతో యంత్రాంగం సిద్ధమవుతోంది. కొద్దిరోజుల ముందు నుంచే కలెక్టర్ ప్రశాంతి నేతృత్వంలో డీఆర్డీఏ పీడీ మూర్తి పర్యవేక్షణలో కసరత్తు చేస్తుండడంతో అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు. శనివారం ఉదయం సరిగ్గా ఏడు గంటలకు సుమారు 5,100 మంది సచివాలయ తదితర శాఖల ఉద్యోగులు రంగంలోకి దిగారు. ఇంటింటికీ వెళ్లి సామాజిక భద్రతా పింఛను చేతిలో పెట్టారు. దీంతో ఉదయం 11 గంటలకే 85శాతం పంపిణీ పూర్తయింది. జిల్లాలో మొత్తం 2,35,344 మంది పింఛను లబ్ధిదారులు ఉండగా సాయంత్రం 7 గంటల సమయానికి 2,24,890 మందికి రూ.97 కోట్ల 23 లక్షల 33వేల 500 పంపిణీ చేశారు. 12 గంటల్లో 96 శాతం మందికి పింఛను డబ్బులు ఇంటికి వెళ్లి అందజేశారు. ఒకవేళ ఇంటి వద్ద ఆ సమయానికి అందుబాటులో లేకపోతే ఫోను చేసి సదరు లబ్ధిదారుడు ఇంటికి వచ్చే సమయానికి వెళ్లి పింఛను అందజేస్తున్నారు. వారు రాలేని పక్షంలో వారి వద్దకే వెళ్లి ఇస్తున్నారు. పింఛను పంపిణీలో జిల్లాలో రాజమహేంద్రవరం అర్బన్ మొదటి స్థానంలో ఉండగా తర్వాత స్థానాల్లో వరుసగా కోరుకొండ చాగల్లు, నిడదవోలు అర్బన్, ఉండ్రాజవరం ఉన్నాయి. కోరుకొండ మండలం బూరుగుపూడి పంచాయతీ పరిధిలో అనారోగ్యం వల్ల మంచానికే పరిమితమైన పలువురికి జిల్లా కలెక్టర్ ప్రశాంతి స్వయంగా వెళ్లి పింఛను అందజేశారు.

బెర్లిన్‌లో ఈనెల 4 నుంచి 6 వరకూ ఐటీబీ బెర్లిన్ -2025.. హాజరుకానున్న పర్యాటక మంత్రి దుర్గేష్ - మెయిన్‌లో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (ఆది) సా.6.18
సహరి (సోమ) ఉ.4.59

ప్రతిష్టాత్మకంగా జనసేన ఆవిర్భావ సభ

- వేదిక నిర్మాణ పనులకు మంత్రి నాదెండ్ల భూమి పూజ



పిఠాపురం మండలం చిత్రాడ శివారులో జనసేన ఆవిర్భావ సభా ప్రాంగణంవద్ద వేదిక నిర్మాణానికి భూమి పూజ అనంతరం జనసేన నేతలతో మంత్రి నాదెండ్ల

కాకినాడలో జనసేన ఆవిర్భావ సభ సన్నాహక సమావేశం 7

పిఠాపురం/పిఠాపురంరూరల్, మార్చి1(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఏర్పాటు చేస్తున్న జనసేన ఆవిర్భావ సభను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ శివారు ఎస్‌బీ వెంచర్స్‌లో ఈనెల 14న నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ సభ ఏర్పాట్లకు శనివారం సాయంత్రం శ్రీకారం చుట్టారు. సభా ప్రాంగణం వద్ద వేదిక నిర్మాణ పనులకు నాదెండ్ల, ప్రజా ప్రతినిధులు, నాయకులు భూమిపూజ నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య పూజా కార్యక్రమాలు జరిపించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో లభించిన ఈ విజయం ప్రజల కోసమేనని, అదే అంకితభావంతో నిరంతరాయం పనిచేస్తామని సభ ద్వారా తెలియజేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ద్వారా ప్రతి కుటుంబానికి మేలు జరిగేలా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులు పనిచేస్తారన్నారు. రాష్ట్ర ప్రజలకు విజయాన్ని అంకితం చేసేలా సభ ఉంటుందన్నారు. ఆవిర్భావ సభకు ఏర్పాట్లు అన్నీ పకడ్బందీగా ఉండాలన్నారు. 50 ఎకరాల విస్తీర్ణంలో సభను ఏర్పాటు చేయనున్నట్లు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్, శాసనమండలి ప్రభుత్వ విప్ హరిప్రసాద్, కుడా చైర్మన్ తుమ్మలరామస్వామి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, టిడ్కో చైర్మన్ అజయకుమార్, పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, జనసేన పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ కల్యాణం శివశ్రీనివాసరావు, శాసనసభ ప్రభుత్వ విప్‌లు బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, అరవ శ్రీధర్, నేతలు కదారి తమ్మయ్యనాయుడు, మురాలశెట్టి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.



ఒకటా.. రెండ్రోజులా..

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపే వేరు
- పోలైన ఓట్లలో 51 శాతం ప్రాధాన్యత ఓట్లు లభిస్తే విజేతే
- కాకుంటే ప్రాధాన్యత క్రమంలో గంటల తరబడి లెక్కించాలి
- బ్యాలెట్ పత్రాలు సరిపోల్చుకుని లెక్కించాల్సి ఉన్నందున భారీ జాప్యం
- గత అనుభవాలు చెబుతున్నది ఇదే
- రేపే ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

సాధారణ ఎన్నికలు అలా..

ఐదేళ్లకొకసారి జరిగిన సాధారణ ఎన్నికల్లో ఓటేసేందుకు చాలాకాలం నుంచి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు వాడుతున్నారు. పోలింగ్‌లో వేగం పెంచడం, ఓటర్లకు ఏ సమస్య లేకుండా పారదర్శ కంగా తాము ఎవరికి ఓటేసిందనే విషయం ఒక స్పష్టత వచ్చేలా ఈ పోలింగ్ యంత్రాలను వినియోగిస్తున్నారు. కౌంటింగ్ విషయానికి వచ్చేసరికి వేలల్లో ఉండే ఓట్ల లెక్కింపు గంటల్లో పూర్తవుతుంది. ఆ వెను వెంటనే ఫలితం వెల్లడవుతుంది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ఇలా..

ఈ ఎన్నిక ఆసాంతం ప్రాధాన్యత క్రమంలో లభించే ఓట్లను బట్టే ఫలితం ఆధారపడి ఉంటుంది. సాధారణ ఎన్నికల మాదిరిగా కాకుండా ఈ ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలను వినియోగిస్తారు. ఇంతకు ముందున్న పాతకాలం నాటి పద్ధతే పోలింగ్‌లో అమలవుతుంది. ఓట్ల లెక్కింపులోను నానా తంటాలు పడాల్సిందే. గంటలకు బదులుగా రోజుల తరబడి ఓట్ల లెక్కింపు జరుగుతూనే ఉంటుంది.

(ఏలూరు/రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పట్టభద్రుల నియోజకవర్గ పోలింగ్ ముగిసింది. ఇక మిగిలిందల్లా ఓట్ల లెక్కింపు. ఓటర్లు తమకు నచ్చిన అభ్యర్థులకు ప్రాధాన్యత క్రమంలో ఓటు వేస్తూ వచ్చారు. అయితే ఇప్పుడు అసలు ప్రాధాన్యత ఓటు అంటే ఏమిటి, మొదటి ప్రాధాన్యత ఓటు, ఇతర ప్రాధాన్యత ఓట్లకు తేడా ఏమిటి, ఈ ఓట్లు ఏవిధంగా లెక్కిస్తారు. అసలు విజేతగా గెలవాలంటే అభ్యర్థికి రావాల్సిన ఓట్లు ఎన్ని. లెక్కింపు ప్రక్రియ ఎలా ఉంటుంది.. అనే ప్రశ్నలే అటు ఓటు వేసిన వారికి, ఇటు ఫలితం కోసం ఎదురుచూసే వారికి ఎన్నో సందేహాలు. మామూలుగా సాదాసీదాగానే ఎలక్ట్రానిక్ యంత్రాలతో కౌంటింగ్ పూర్తి చేస్తే గంటల వ్యవధిలోనే ఫలితం వస్తుంది. కాని ప్రాధాన్యత ఓటును పరిగణనలోకి తీసుకుని ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లను లెక్కించాల్సి ఉంది. మొదటి ప్రాధాన్యత ఓట్లు ఏ అభ్యర్థికి పోలైన ఓట్లలో 50 శాతానికి మించి వస్తాయో ఆ అభ్యర్థి గెలిచినట్టుగా తేలుస్తారు. ఓటు వేసిన వారి పోలైన ఓట్లలో చెల్లుబాటు అయిన ఓట్లనే పరిగణనలోకి తీసుకుంటారు. అలా ఆ ఓట్లలో సగాని కంటే ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా ఆ అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. ఉదాహరణకు మొత్తం పోలైన ఓట్లు 2 లక్షల 14 వేలు చెల్లుబాటు అయితే విజేతకు లక్షా ఏడువేల ఒక ఓటు వచ్చినా సరిపోతుంది. అలా వస్తేనే మొదటి ప్రాధాన్యత ఓటుతో ఈ అభ్యర్థి గెలుపొందినట్టు అవుతుంది. ఒకవేళ మొదటి ప్రాధాన్యత ఓటుతో ఈ మైలురాయి అధిగమించకపోతే ఎలిమినేషన్ ప్రక్రియ ప్రారంభిస్తారు. గెలుపు కోటాకు సరిపోయినన్ని ఓట్లు ఎవరికైతే వస్తాయో అప్పటి వరకు మిగతా ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. ఈ విధంగా మొదటి ప్రాధాన్యత ఓటు తర్వాత రెండవ ప్రాధాన్యత ఓటును లెక్కిస్తారు. అయితే పోటీ చేసిన అభ్యర్థుల్లో అందరికన్నా మొదటి ప్రాధాన్యత ఓటు తక్కువ వచ్చిన అభ్యర్థి నుంచి ఈ ఎలిమినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఆరోహణ క్రమంలో అభ్యర్థులు సాధించిన మొదటి ప్రాధాన్యత ఓట్ల జాబితాను తయారు చేస్తారు. ఇలా చివరి అభ్యర్థికి రెండో ప్రాధాన్యత ఓటు ఎవరు వేశారని ఓట్లను లెక్కించి ఆ ఓట్లను ఆయా అభ్యర్థులకు జమ చేస్తూ వస్తారు. ఇలా కింద నుంచి పైవరకు ఇదే తరహాలో లెక్కించి ఈ ఓట్లను కలుపుతూ చివరి అభ్యర్థులను ఎలిమినేట్ చేస్తూ వెళ్తారు. ఒకవేళ ద్వితీయ ప్రాధాన్యత ఓట్లలోను మెజార్టీ ఓట్ల మార్కుకు ఏ అభ్యర్థి చేరకపోతే తృతీయ ప్రాధాన్యత ఓట్లను గణించి ఆ అభ్యర్థికి జమ చేస్తూ వస్తారు. అప్పటికీకాకపోతే నాల్గవ ప్రాధాన్యం ఇలా మెజార్టీ మార్కు సంఖ్యను ఏదో ఒక అభ్యర్థికి చేరేవరకు ఎలిమినేట్ ప్రక్రియ అనేది సాగుతూనే ఉంటుంది. దాంతో మొదటి ప్రాధాన్యంతోపాటు ఇతర ప్రాధాన్యత ఓట్లు కీలకమే.

ఇప్పటికే ఎడతెగని ఉత్కంఠ

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో ఓటర్లు ఏ రకంగా స్పందించారనే ఉత్కంఠ అందరి అభ్యర్థుల్లోను నెలకొంది. తెలుగుదేశం అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం, పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు మధ్యే ఫలితం తేలబోతుందని భావిస్తున్నారు. సోమవారం జరిగే కౌంటింగ్ ప్రక్రియ సాధారణ ఎన్నికలకంటే భిన్నంగా ఉండబోతుండడంతో టెన్షన్ నెలకొంది. ఈసారి జరిగిన పోలింగ్ సరళిని బట్టి చూస్తే మొదటి ప్రాధాన్యతలోనే అభ్యర్థి గెలుపోటములు తేలబోతున్నాయని భావిస్తున్నారు. గత అనుభవాలను చూస్తే దాదాపు 14 గంటల తర్వాత గాని లెక్కింపు ప్రక్రియ ఒక కొలిక్కిరాదు. లేదా 36 లేదా 48 గంటలపాటు సాగే అవకాశం లేకపోలేదు.

ఒడిశా వనదేవతకు...

● ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఒడిశా, ఆంధ్రా అధికారులు
● వేలల్లో తరలిరానున్న ఆంధ్రా, ఒడిశా భక్తులు

ఆంధ్రా మన్యంలో ఉత్సవాలు



● రేపటి నుంచి మన్నెం కొండ జాతర ప్రారంభం



జాతర ఉత్సవంలో పాల్గొన్న ఆంధ్రా, ఒడిశా భక్తులు (ఫైల్)

మోతుగూడెం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో పొల్లూరు అనే గ్రామం ఉంది. ఇది ఒడిశా సరిహద్దులో ఉండడంతో ఆ రాష్ట్ర ఉత్సవాలను మన రాష్ట్రంలోనూ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. నిజంగా ఆశ్చర్యాన్ని కలిగించే విషయం. కానీ ఇది నిజం. వివరాల్లోకి వెళితే... పొల్లూరు ప్రాంతంలో దట్టమైన అడవుల్లో ఉన్న జలపాతం వద్ద ఈ ఉత్సవాలను ఘనంగా జరుపుతారు. అదీ కూడా మన ప్రాంతంలో ఒడిశా ప్రభుత్వం నిర్వహించడం విశేషం. మన్నెంకొండ జాతరగా పిలిచే ఈ ఉత్సవానికి ఒక ప్రత్యేకత ఉంది. రెండేళ్లకు ఒకసారి ఒడిశా ప్రజలు జాతరను మన రాష్ట్రంలో నిర్వహిస్తుండడం పూర్వకాలం నుంచి వస్తున్న సంప్రదాయం. మల్కనగిరి ప్రాంతానికి చెందిన వనదేవత మన మోతుగూడెం ప్రాంతంలో ఉన్న పొల్లూరు వద్ద ఉన్న జలపాతం వద్దకు తెచ్చి స్నానాలు ఆచరించే ఆచారం ఉండేది. ఈ క్రమంలోనే అక్కడ ప్రజలు ఇలా ప్రతి రెండేళ్లకు ఒకసారి వచ్చే ఒక గడియల్లో ఇక్కడ జలపాతం వద్ద తీసుకొని వస్తారు. ఆ వనదేవతను ఇలా తీసుకువచ్చి రాత్రంతా ప్రత్యేకపూజలు చేసి జాగారం చేస్తారు. దీన్నే మన్నెంకొండ జాతరగా పిలుస్తారు. పలు ప్రాంతాలకు చెందిన గిరిజనులను వచ్చి వనదేవతను పల్లకీలో మేళతాళాలతో భారీ ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ ఉన్న సీలేరు నదిని దాటి పొల్లూరుకి తెస్తారు. ఈ జాతర హంగామా ఒడిశాలో ఫిబ్రవరి 11న ప్రారంభమై మార్చి 12వ తేదీతో ముగిస్తుంది. అయితే ఇక్కడ కూడా ఈ ప్రాంత వాసులు వారం రోజుల పాటు వనదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

● లక్ష బలి యాత్ర

జాతర వద్ద లక్షపల్లి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.ఈ సందర్భంగా మేకలు, కోళ్లను దేవతకు నైవేద్యంగా సమర్పిస్తారు. దాదాపు లక్ష మూగ జీవులను బలి ఇవ్వనున్నారు.

బంగారు చేప దర్శనమిస్తుందని నమ్మకం



అమ్మవారిని తీసుకొస్తున్న దృశ్యం (ఫైల్)

జాతరకు వచ్చే భక్తులకు ఇక్కడ జలపాతంలో బంగారు చేపదర్శన మిస్తుందని నమ్ముతారు. అంటే శబరిమలలో అయ్యప్ప భక్తులకు మకరజ్యోతి ఎలా కనిపిస్తుందో అలాగే ఇక్కడికి వచ్చేవారికి జలపాతంలో బంగారు చేప కనిపిస్తుంది. అందుకే వేలాదిగా భక్తులు తరలివస్తారు. మోతుగూడెం ఎస్‌ఐ శివనారాయణ మాట్లాడుతూ భక్తులకు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 300 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. మల్కన్‌గిరి తహసీల్దార్ నీలకంఠ బోర్, కలిమెలల తహశీల్దార్ సత్యగురు, లోయర్ సీలేరు ఏపీ జెన్‌కో సెక్యూరిటీ హెడ్‌గార్డ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు నదిపై ఫ్లోటింగ్ జెట్ బ్రిడ్జి



పొల్లూరులోని సీలేరు నదిపై ఫ్లోటింగ్ జెట్ బ్రిడ్జిను ఏర్పాటు చేశారు. ఈనెల 3న మన్నెం కొండ జాతర జరుగుతున్న దృష్ట్యా రెండోసారి అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. దాదాపు 20 వేల మంది భక్తులు ఒడిశా, ఆంధ్రా సరిహద్దు ప్రాంతాల నుంచి రానున్నారు. దీంతో ఒడిశా ప్రభుత్వం ఏకో టూరిజం కింద ఫ్లోటింగ్ జెట్ బ్రిడ్జిని ఏర్పాటు చేసినట్టు ఒడిశా అధికారులు తెలిపారు. అలాగే సోమవారం జరిగే జాతర ఏర్పాట్లను ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి ఐటీడీఏ పీవో దుర్యోధన బోయ్ బృందం పరిశీలించింది.

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

● 30 రోజుల పాటు కఠిన నిష్టతో ముస్లిం సోదరుల నమాజ్‌లు



మామిడికుదురులో సిద్ధమైన మసీదు

కాకినాడ సిటీ /మామిడికుదురు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ముస్లింల పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలు ఉమ్మడి తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. శనివారం సాయంత్రం ఆకాశంలో నెలవంక కనిపించడంతో దీక్ష చేపడతారు. ఈ నెల 30వ తేదీ వరకు దీక్షలు జరుగుతాయి. ప్రతిరోజూ తెల్లవారు జామున 4.30 గంటలకు సహరీతో ప్రారంభమై , తిరిగి సాయంత్రం 6.20 గంటలకు ఇఫ్తార్‌తో ముగుస్తుంది. దీక్షల్లో భాగంగా ముస్లిం సోదరులంతా ఐదు పర్యాయాలు నమాజ్, ప్రార్థనలు చేసి రాత్రికి ఖురాన్‌ను పఠిస్తారు. పేద, ధనిక, చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా మహిళలు సైతం ఉపవాసాలు చేస్తారు.

ప్రజలను మోసగించే బడ్జెట్

● ఏపీలో నిధులు లేకున్నా భారీగా లెక్కలు ● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



అంబాజీపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

అంబాజీపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టి ప్రజలను మోసగించే విధంగా ఏపీలో నిధులు లేనప్పటికీ బడ్జెట్‌లో లెక్కలు మాత్రం భారీగా చూపారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటలో కామ్రేడ్ నేలపూడి సూరన్న 30వ వర్ధంతి కార్యక్రమంలో రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సూరన్న స్వగృహం వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కె.సత్తిబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. పేదల అభ్యున్నతికి భారత కమ్యూనిస్టు పార్టీ పనిచేస్తోందన్నారు. కమ్యూనిస్టు భావజాలం ఉనికి పుచ్చుకున్న కామ్రేడ్ సూరన్న చిన్న, సన్నకారు రైతులను, కౌలు రైతుల ప్రయోజనాల కోసం ప్రారంభించిన ఉద్యమం భూమి కోసం, భుక్తి కోసం పోరాడే శక్తి ఎర్రజెండా నాయకత్వం కమ్యూనిస్టు నాయకుడిగా కార్మిక ఉద్యమానికి ఒక ప్రభంజనమై జ్వలించారన్నారు. అంబాజీపేటలో కమ్యూనిస్టు పార్టీకి మంచి ఆదరణ ఉందని, మృతిచెందిన ప్రతి కామ్రేడ్ కుటుంబం నుంచి ఒక్కరైన ఎర్రజెండాను పట్టుకుని కామ్రేడ్ ఆశయాలను కొనసాగించాలని ఆయన సూచించారు. దేశం గర్వించే రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు కుట్ర జరుగుతోందన్నారు. 1925 డిసెంబరు 26న కాన్పూర్ నగరంలో సీపీఐ ఆవిర్భవించిందని, ఈ ఏడాది డిసెంబరు 26 నాటికి శతవసంతాలు పూర్తవుతుందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో శత వార్షికోత్సవం కార్యక్రమాలు చేపట్టి ప్రజలను చైతన్య పరుస్తామన్నారు. అలాగే డిసెంబరు 24, 25వ తేదీల్లో విజయవాడలో జరిగే అంతర్జాతీయ సెమినార్‌కు 40 దేశాల నుంచి కమ్యూనిస్టులు, సోషలిస్టులు, దేశంలోని వామపక్ష మేధావులు హాజరవుతారన్నారు. తొలుత సూరన్న చిత్రపటం వద్ద సీపీఐ నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబాజీపేటలో ఎర్ర జెండాలతో ర్యాలీ నిర్వహించారు. సూరన్న కుటుంబ సభ్యులు కామ్రేడ్ నేలపూడి నాగభూషణం రచించిన కామ్రేడ్ సూరన్న జీవిత చరిత్ర పుస్తకాన్ని రామకృష్ణ ఆవిష్కరించారు. డేగా ప్రభాకరరావు, తాటిపాక మధు, చెల్లుబోయిన కేశవశెట్టి, దేవ రాజేంద్రప్రసాద్, పితాని ఆనందరావు, నేలపూడి స్టాలిన్‌బాబు, సుందరయ్య, గిరి పాల్గొన్నారు. అలాగే జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, పలువురు సూరన్న చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

మైనార్టీ యువతకు జాబ్‌మేళాలు

అమలాపురం టౌన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సీడాప్ ఆధ్వర్యంలో మైనార్టీ యువతకు జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్టు ఆ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకుడు ఎం.సునీల్‌కుమార్ తెలిపారు. అన్ని జిల్లాల్లో ఈనెల 4, 14, 18, 28 తేదీల్లో జరుగుతాయన్నారు. మైనార్టీ వర్గాలకు చెందిన యువత పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందాలని కోరారు. ఈనెల 4న జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అమలాపురం మిరియం డిగ్రీ కళాశాల, ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల, 14న కాకినాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, పి.గన్నవరం ఏపీఎస్‌డబ్ల్యుఆర్‌ఐ ఈఎస్ డిగ్రీ కళాశాల, రామచంద్రపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో. 18న కాకినాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాల, పిఠాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, కొత్తపేట వీకేవీప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజోలు డిగ్రీ కళాశాల, 28న పెద్దాపురం న్యాక్ ట్రైనింగ్ సెంటర్ (సామర్లకోట), ప్రత్తిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఏలేశ్వరం), మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో జాబ్‌మేళాలు జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు 9849901141 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

నేడు, రేపు పలు రైళ్ల రద్దు

● ట్రాక్ ఆటోమెటిక్ సెక్షన్ పనులే కారణం

సామర్లకోట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్‌లో సామర్లకోట రైల్వే ఇంజనీరింగ్ సెక్షన్ పరిధి కడియం - ద్వారపూడి - అనపర్తి మధ్య ట్రాక్ ఆటోమెటిక్ సెక్షన్ పనులు జరుగుతున్నందున సామర్లకోట మీదుగా అటు విజయవాడ, ఇటు విశాఖకు వెళ్లాల్సిన పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసినట్టు రైల్వే ఉన్నతాధికారులు శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

●17239 నెంబరు గల గుంటూరు - విశాఖ మధ్య నడుస్తున్న సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఆదివారం తాత్కాలికంగా రద్దు.

●17240 నంబరు గల విశాఖ - గుంటూరు మధ్య నడుస్తున్న సింహాద్రి ఎక్స్‌ప్రెస్ 2,3 తేదీలలో తాత్కాలికంగా రద్దు.

●12805 నంబరు గల విశాఖ-లింగంపల్లి మధ్య నడుస్తున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఆదివారం తాత్కాలికంగా రద్దు.

● 12806 నంబరు గల లింగంపల్లి-విశాఖ మధ్య నడుస్తున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 3వ తేదీ (సోమవారం) తాత్కాలికంగా రద్దు చేశారు. ప్రయాణికులు ప్రత్యామ్నాయ రైళ్ల ద్వారా ప్రయాణాలు కొనసాగించాలని రైల్వే అధికారులు కోరారు.

విద్యార్థుల వికాసానికి 'సవిష్కర్' దోహదం

● నన్నయ వర్శిటీ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి1(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల వాస్తవ ప్రపంచ అంతర్ దృష్టితో విద్యార్థులను సవిష్కర్ వంటి వేదికలు సన్నద్ధం చేస్తాయని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. వర్శిటీలోని కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఉత్సవం సవిష్కర్-2025ను శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ ఇంట్లో అమ్మ దగ్గర నుంచి మేనేజ్‌మెంట్ నేర్చుకోవాలని అన్నారు. ప్రాక్టికల్ లెర్నింగ్, ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్, నైపుణ్యాభివృద్ధి, నెట్‌వర్కింగ్ అవకాశాలు, వ్యవస్థాపక మనస్తత్వం, కాన్ఫిడెన్స్ బిల్డింగ్, వ్యాపార పోకడలు, సాంకేతికత బహిర్గతం, రెజ్యూమ్, కెరీర్ అవకాశాలను మెరుగుపరచడంపై విద్యార్థులు దృష్టిసారించాలన్నారు. గెయిల్ ఇండియా లిమిటెడ్ రాజమండ్రి హెచ్‌ఆర్ మేనేజర్ వైఏఎస్ మూర్తి మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎల్‌ఐసీ సీనియర్ మేనేజర్ కె.సంధ్యారాణి మాట్లాడుతూ ఆధునిక కాలంలో అన్నిరంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని, వాటిని అవగాహన చేసుకుంటూ అభివృద్ధి దిశగా విద్యార్థులు అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో నన్నయ వర్శిటీ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ విభాగాధిపతి ఎస్.ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించారు.

సత్యదేవా నర్సరీని సందర్శించిన ఫారెస్ట్ అకాడమీ బృందం

కడియం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కడియపులంక పుల్లా చంటియ్య-సత్యదేవా నర్సరీని శనివారం తెలంగాణా రాష్ట్ర ఫారెస్టు అకాడమీ బృందం సందర్శించింది. బృందానికి నర్సరీ ఎండీ పుల్లా పెదసత్యనారాయణ స్వాగతించారు. నర్సరీలో వివిధ రకాల మొక్కలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఫారెస్టు అకాడమీ ఏసీడీపీ రామ్మోహనరావు మాట్లాడుతూ దేశవిదేశీ ఉద్యానవన సంపద ఒకేచోట నిక్షిప్తమై ఉందన్నారు. రాజమహేంద్రవరం ఫారెస్టు హెడ్ ఆనందరావు, 25వ బ్యాచ్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు ఉన్నారు. మొక్కల అధ్యయనం కోసం వచ్చామన్నారు. కార్యక్రమంలో మెర్ల కృష్ణ తదితరులు ఉన్నారు.



సత్యదేవానర్సరీని సందర్శించిన తెలంగాణా ఫారెస్టు అకాడమీ బృందం

గోవిందనామస్మరణతో మార్మోగిన వాడపల్లి

● వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం
● స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.50లక్షలు



వాడపల్లి వెంకన్న ఆలయంలో అన్నదానం వద్ద క్యూలైన్లలో వేచియున్న భక్తులు

ఆత్రేయపురం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భకులు తులాభారా లు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. కాకినాడకు చెందిన కూచిపూడి నృత్యప్రదర్శన భక్తులను విశేషంగా ఆకర్షించింది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం కాలినడకన కొత్తపేట నుంచి వాడపల్లి పాదయాత్ర నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లు చేశారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.50,00575 లభించినట్టు ఉపకమిషనరు సూర్యచక్రధరరావు తెలిపారు.

ఆటల పోటీల్లో పాల్గొనే వారికి క్యాజువల్ లీవ్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి1(ఆంధ్ర జ్యోతి): ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మహిళలు ఆటల పోటీలలో పాల్గొనేందుకు ఈనెల 5,6 తేదీలలో స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేశామని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్‌అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావారు అభ్యర్థనకు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేశామన్నారు.

అక్కూ పీజీ క్యాంపస్ ప్రిన్సిపాల్‌గా ప్రశాంతశ్రీ

సర్పవరంజంక్షన్,మార్చి1(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం అక్కూ ఎంఎస్‌ఎన్ పీజీ క్యాంపస్ ప్రిన్సిపాల్‌గా ఎస్.ప్రశాంతశ్రీ శనివారం బా ధ్యతలు స్వీకరించారు. ఈమె ఇంతకుముందు ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ఆమె మాట్లాడుతూ పీజీ క్యాంపస్‌లో కొత్తకోర్సుల ప్రారంభం, క్యాంపస్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

వైభవంగా శ్రీపుష్పయాగం

» వివిధ పుష్పాలతో ఉత్సవమూర్తుల అలంకరణ



విశేష అలంకారంలో స్వామివారు, అమ్మవారు

సామర్లకోట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కుమారరామ భీమేశ్వరస్వామి, బాలా త్రిపుర సుందరి అమ్మవార్ల శ్రీపుష్పయాగోత్సవ పూజలు శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజలలో భాగంగా కళ్యాణ వేదికపై స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ఆలయ పండితులు వేమూరి సోమేశ్వర శర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, రాజగోపాలశర్మ, వినయ్, వెంకన్న శాస్త్రోక్తంగా పుష్పార్చన నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఊరేగింపుగా బాలా త్రిపుర సుందరి అమ్మవారి మందిరం వద్దకు తోడ్కొని వచ్చారు. వివిధ పుష్పాలతో అలంకరించిన ఊయల మందిరంలో ఉత్సవమూర్తులను అలంకరించి భక్తుల దర్శనాలకు అనుమతించారు. ఈ సంద ర్భంగా పలువురు దాతలు సమకూర్చిన 110 రకాల పిండి వంటకాలను ఊయల మండపం వద్ద అలంకరించారు. ప్రముఖులకు దంపత తాంబూలాలు అందజేశారు. 2000మంది భక్తులు శ్రీపుష్పయాగ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తువాళ్లు, రవికలు, పసుపు, కుంకుమ, గాజులు, కొబ్బరి హల్వా, లడ్డూ, అన్నవర సత్యదేవుడి ప్రసాద ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కంటే జగదీష్‌మోహన్(బాబు), బిక్కిన పరమేశ్వర సాయి సత్యనారాయణ, చుండ్రు శ్రీనువాసుసూర్యభాను, కంచర్ల పద్మావతి జగన్నాధగుప్త, ఆర్వీ సుబ్బరాజు, గం జి బూరిబాబు, తదితర కార్తీక దీపారాధన కమిటీ, భక్తకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోటిపల్లి హుండీ ఆదాయం రూ. 11,17,350



హుండీలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

కె.గంగవరం, మార్చి1(ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్య క్షేత్రం కోటిపల్లి శ్రీఛాయా సోమేశ్వరస్వామి ఆలయంలో మహాశివ రాత్రి సందర్భంగా హుండీలకు వచ్చిన ఆదాయాన్ని శనివారం ఆలయ ఆవరణలో లెక్కించారు. వీఐపీ, ప్రత్యేక దర్శనం, భక్తుల విరాళాలు, హుండీల ద్వారా మొత్తం రూ.11,17,350 వచ్చింది. గత సంవత్సరం కంటే రూ.44వేలు అదనంగా వచ్చిందని ఆలయ ఈవో భీమశంకరం తెలిపారు. ఆలయ తనిఖీ అధికారి బాలాజీ రాంప్రసాద్, కూటమి నాయకులు వెంటూరు వీర్రాఘవులుచౌదరి, గొడవర్తి రామకృష్ణ, చీకట్ల సోమేష్, రాము, శ్రీనివాసు పాల్గొన్నారు.



తిరుచ్చివాహనంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

సత్యదేవుడికి వేడుకగా తిరుచ్చిసేవ

అన్నవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం తిరుచ్చిసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10 గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి మేళతాళాలతో తూర్పురాజ గోపురం వద్దకు తిరుచ్చివాహనంపై తోడ్కొని వచ్చారు. పండితుల మంత్రోచ్చరణలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ ముమ్మారు తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షణ గావించారు. హారతులిచ్చి తిరిగి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

రేపు హుండీల ఆదాయం లెక్కింపు

సత్యదేవుడి సన్నిధి లో భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను ఈనెల 3న లెక్కించి వచ్చిన కానుకలను బ్యాంక్‌లో దేవస్థానం ఖాతాకు చేయనున్నట్లు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు వెల్లడించారు. ప్రత్యేకవిధులు కేటాయించిన సిబ్బంది తప్పనిసరిగా లెక్కింపులో పాల్గొనాలని కోరారు.

క్రీడాకారుల ఉపకారవేతన అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడఅర్బన్, మార్చి1(ఆంధ్రజ్యోతి); వివిధ క్రీడల్లో ప్రతిభకనబరిచిన క్రీడాకారులకు 2025-26కి ఉపకారవేతన అవార్డులు అందజేయడానికి భారత ఆహారసంస్థ జిల్లాలోని క్రీడాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తుందని జిల్లా క్రీడాప్రాధికారసంస్థ అధికారి బి.శ్రీనివాసకుమార్ తెలిపారు. 15 నుంచి 24ఏళ్ల మధ్య ఉన్న గ్రామీణ, పట్టణ క్రీడాకారులు ఫుట్‌బాల్, క్రికెట్, హాకీ విభాగాల్లో పురుషులు, టేబుల్‌టెన్నిస్, బ్యాడ్మింటన్, వెయిట్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్ విభాగాల్లో స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఈనెల ఆరో తేదీలోగా ఆన్‌లైన్లో (డబ్ల్యూ, డబ్ల్యూడబ్ల్యూ, ఎఫ్‌సీఐ.జీవోవీ.ఇన్)కి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

చింతలూరు నూకాంబికా జాతర ఉత్సవాలకు శ్రీకారం

» 15రోజులపాటు గ్రామాల్లో అమ్మవారి బుట్టగరగ ఊరేగింపు



బుట్టగరగతో ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఆలమూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాలలో జారత ఉత్సవాలలో గుర్తింపు పొందిన ఉత్సవాలలో చింతలూరు నూకాంబికా అమ్మవారి జాతరఒకటి. అమ్మవారి జాతర ఉత్సవాలను శనివారం బుట్టగరగతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈనెల 28న అమ్మవారి జాతర ఉత్సవం, 29న తీర్థమహోత్సవం, 30న ఉగాది ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్ణయించారు. నెలరోజుల ముందుగా అమ్మవారి గరగ ఉత్సవాలు ప్రారంభిస్తారు. శనివారం నూకాంబికా అమ్మవారి ఆలయ అర్చకులు ఆసాధులు ప్రత్యేకపూజలుచేసి ప్రత్యేకంగా తయారు చేసిన తాటాకు బుట్ట గరగకు పసుపు బియ్యంతో అమ్మవారి పేరుతో అందంగా అలంకరించి ముందుగా గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తారు. ఆలయంవద్ద ప్రత్యేకపూజల అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి వుండవల్లి వీర్రాజు చౌదరి అధ్వర్యంలో గ్రామపెద్దలు గన్ని చిన్నబ్బు, వైట్ల శేషుబాబు, గన్ని సూరిబాబు, అల్లం రాజు భరణి తదితరుల సమక్షంలో బుట్ట గరగ ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో జరిగిన ఊరేగింపులో మహిళలు పసుపునీళ్లతో స్వాగతం పలికారు. మండలంలో రోజు ఒకఊరు చొప్పున 15రోజులపాటు అమ్మవారిని బుట్టగరగతో ఊరేగింపు నిర్వహించి తదుపరి 15రోజులపాటు కొత్త, పాత పూల ఉత్సవాలు నిర్వహించి అనంతరం ఈనెల 28న ప్రధాన జాతర నిర్వహిస్తామని కార్యనిర్వహణాధికారి వీర్రాజుచౌదరి వివరించారు.

పరీక్షా సమయ(ర)ం

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు పరీక్షా కేంద్రాల వద్ద దృశ్యాలను ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా.



పిఠాపురంలో ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు



అమలాపురంలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు





రాజమహేంద్రవరంలో హాల్‌టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు, విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



కాకినాడలో హాల్ టికెట్ నెంబర్లు చూసుకుని పరీక్షకు వెళుతున్న విద్యార్థులు



చిత్రాడలో 14న జనసేన ఆవిర్భావ సభ

- ప్రతి నాయకుడు, కార్యకర్త ఐకమత్యంగా పని చేసి విజయవంతం చేయాలి
- జనసేన పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్
- కాకినాడలో సన్నాహక సమావేశం



కాకినాడలో జనసేన ఆవిర్భావ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, నాయకులు

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో ఈనెల 14న నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ పీఏసీ చైర్మన్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. శనివారం కాకినాడ కుళాయి చెరువులో ఉన్న గోదావరి కళా క్షేత్రంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో కుడా చైర్మన్ తుమ్మలబాబు అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. జనసేన పార్టీ పదేళ్లపాటు ప్రజల్లో ఉంటూ అనేక కష్టనష్టాలను ఎదుర్కొని ఈ రోజు రాష్ట్రంలో ఒక బలమైన పార్టీగా అవతరించిందన్నారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో జనసైనికులు మన పార్టీని కాపాడిన విధానం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కష్టపడి పనిచేసి జెండాను మోసిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు.

ద్వారంపూడి అహంకారంతో విర్రవీగారు

అధికారం ఉందనే అహంకారంతో వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అహంకారంతో విర్రవీగారని మంత్రి నాదెండ్ల విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో పవన్‌కల్యాణ్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలకు జనసేన కార్యకర్తలు నిరసన చేపట్టగా వారిపై ద్వారంపూడి దాడులు చేయించడమే కాకుండా అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేశారన్నారు. ఇప్పటికీ జనసైనికులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని, అయినా జనసేన శ్రేణులు ధైర్యం కోల్పోకుండా పోరాటం చేస్తున్నారని ఆయన చెప్పారు.

గత ఐదేళ్లు వైసీపీ విధ్వంసం

గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో విధ్వంస కార్యక్రమాలు చేసిందని మంత్రి నాదెండ్ల ధ్వజమెత్తారు. ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేయకుండా వ్యవస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. రోడ్లపై ఉన్న ఒక్క గుంతను కూడా పూడ్చలేదన్నారు. ఇప్పుడు ఆ గుంతలను పూడ్చడానికి రూ.1600కోట్లు కేటాయించినా సరిపోవడం లేదన్నారు. పవన్‌పై అవాకులు చవాకులు పేలుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై కూడా చర్యలు ఉంటాయన్నారు. గత ప్రభుత్వం రైతులకు ధాన్యం బకాయిలు రూ.1600 కోట్లు పెట్టి వెళ్లిపోతే మా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని రైతులకు చెల్లించామని మంత్రి నాదెండ్ల తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల వ్యవధిలో అన్నదాత బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం సొమ్ములు జమ చేస్తుందన్నారు. కమిటీలు నిరంతరం పర్యవేక్షించి సభను విజయవంతం చేస్తాయన్నారు. రాష్ట్ర భవిష్యత్తు జనసేనపైన ఉందన్నారు. నిష్కలంకమైన మన నాయకుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆలోచన వల్లే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత నిర్వహించే తొలి సభ కావడంతో అందరూ సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలన్నారు. ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, కాకినాడ అర్బన్ డెవల ప్‌మెంట్ అథారిటీ చైర్మన్ తుమ్మల రామస్వామి, శాసనసభలో ప్రభుత్వ విప్‌లు బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, అవర శ్రీధర్, జనసేన ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు.



వేడుకలకు కమిటీలు ఏర్పాటు : మంత్రి దుర్గేష్

జనసేన ఆవిర్భావ వేడుకల విజయవంతానికి 500మందితో 14 కమిటీలు రూపొందించామని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.



సమావేశానికి హాజరైన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు

కాకినాడలో కంట్రోల్‌రూమ్

జనసేన ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయడానికి కాకినాడ కుళాయిచెరువు వద్ద ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు మంత్రి నాదెండ్ల తెలిపారు. ఈనెల 8వ తేదీ నుంచి ఇది అందుబాటులోకి వస్తుందన్నారు. కంట్రోల్ రూమ్‌లో సమీక్షలు నిర్వహించుకుని ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లు ఘనంగా చేస్తామ న్నారు. కమిటీల్లో పేర్లు లేకపోయినంత మాత్రాన మీరు పని చే యొద్దని కాదని, ప్రతిఒక్కరూ పనిచేస్తేనే సభ విజయవంతం అవుతుందన్నారు. జనసేన సభ్యత్వాలు 60వేల నుంచి 12.42లక్షల వరకు పెరిగాయని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి నాయకుడు, కార్యకర్త ఐకమత్యంగా పనిచేసి సభను విజయవంతం చేయాలన్నారు.



సీతానగరం మండలం కాటవరంలో దగ్ధమవుతున్న పొగాకు బ్యారన్లు

పొగాకు బ్యారన్లు దగ్ధం

సుమారు రూ.50లక్షల ఆస్తి నష్టం

రాజమహేంద్రవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం కాటవరంలో 4 పొగాకు బ్యారన్లు, 3 గడ్డి పాకలు అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. శనివారం సాయంత్రం 5గంటల ప్రాంతంలో చిట్టూరి వరప్రసాద్, పోలిన ప్రకాశం, చిట్టూరి వీర్రాజుకు చెందిన పొగాకు బ్యారన్లలో వర్జీనియా పొగాకు క్యూరింగ్ జరుగుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ బ్యారన్‌లోని గొట్టాలపై ఆకులు పడి అగ్ని ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఇక్కడ ఉన్నవన్నీ సులభంగా మండే స్వభావం కలిగిన పొగాకు, ములకల కర్రలు, సర్వే బాజులు, రెల్లుగడ్డి, కర్రలు కావడంతో మంటలు వేగంగా ఎగిసిపడుతూ విస్తరించాయి. స్థానికులు ఇళ్లలోని మోటార్లు ఆన్ చేసి నీళ్లతో మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. కోరుకొండ, ఆర్యాపురం, కొవ్వూరు నుంచి సుమారు 10 మంది అగ్నిమాపక సిబ్బంది 3 ఫైర్ ఇంజన్లతో ఘటనా స్థలానికి చేరుకుని సుమారు 2 గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే అప్పటికే పొగాకు బేళ్లతో సహా అన్నీ బూడిదయ్యాయి. ఆస్తినష్టం సుమారు రూ.50లక్షల వరకూ ఉండొచ్చని చెబుతున్నారు. ఆస్తి నష్టంపై అంచనా వేయాల్సి ఉందని, ప్రమాద కారణాలపై కూడా ఆరా తీస్తున్నామని ఫైర్ అధికారులు తెలిపారు. కాగా బ్యారన్ల వద్ద ఎలాంటి అగ్నిమాపక పరికరాలు, ఏర్పాట్లు లేకపోవడంతో వేగంగా మంటలు విస్తరించి నష్టం అధికంగా ఉన్నట్టు తెలుస్తోంది.

నకిలీ మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

46 మద్యం బాటిళ్ల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణ

కాకినాడ క్రైం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఖాళీ మద్యం బాటిళ్లలో స్థానిక మద్యాన్ని నింపుతూ విదేశీ మద్యంగా విక్రయాలు సాగిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన కాకినాడ పోలీసులు వారి నుంచి శనివారం 46 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి త్రీటౌన్ లా అండ్ ఆర్డర్ సీఐ కెవిఎస్.సత్యనారాయణ వివరాలు వెల్లడించారు. స్థానిక సాంబమూర్తి నగర్‌కు చెందిన సయ్యద్ సలీం భాషా, బ్యాంకుపేటకు చెందిన శీలం రామకృష్ణ కలిసి డబ్బులు సులువుగా సంపాదించాలనే దురుద్దేశ్యంతో గత 3 నెలల నుంచి హైదరాబాద్ నుంచి ఖాళీ విదేశీ మద్యం బాటిళ్లను సేకరించి కాకినాడలో దొరికే ఇండియన్ మేడ్ విస్కీ లిక్కర్ బాటిళ్లను కొని ఒక పరికరంతో ఖాళీ సీసాలోకి మద్యాన్ని నింపి విదేశీ బాటిళ్లంటూ ఎక్కువ నగదుకు విక్రయించేవారు. ఈ నేపథ్యంలో తమకు వచ్చిన సమాచారం మేరకు నిఘాను పటిష్టం చేయగా నిందితులను స్థానిక బ్యాంక్‌పేటలో అరెస్ట్ చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామని చెప్పారు.

డిపాజిట్‌దారులు వదంతులు నమ్మవద్దు

జయలక్ష్మి సొసైటీ చైర్మన్ గంగిరెడ్డి త్రినాధరావు, డైరెక్టర్లు

సర్పవరం జంక్షన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జయలక్ష్మి సొసైటీ డిపాజిట్‌దారులకు న్యాయం చేసేందుకు చట్టబద్ధంగా పని చేస్తున్నామని, సొసైటీ నిర్వహణపై కొంతమంది లేనిపోని వదంతులు సృష్టించి గందరగోళానికి గురిచేస్తున్నారని వాటిని నమ్మవద్దని ఆ సొసైటీ చైర్మన్ గంగిరెడ్డి త్రినాధరావు, డైరెక్టర్లు కోరారు. శనివారం సర్పవరం జంక్షన్‌లో జయలక్ష్మి సొసైటీ సెంట్రల్ కార్యాలయంలో పాలకవర్గం సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రినాధరావు మాట్లాడుతూ కోట్లాది డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేసిన పూర్వపు సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లపై సీఐడీ అరెస్ట్ చేశారని, వారు నుంచి కోట్లాది విలువ చేసే స్థిరాస్తులను సీఐడీ స్వాధీనం చేసుకుని కోర్టులో చట్టబద్ధంగా ఈ ఆస్తుల స్వాధీనం, విక్రయం కోసం కృషి చేస్తున్నామన్నారు. కోట్లాది రూపాయలతో ఉడాయించడమే కాకుండా ఎటువంటి ఆధారాలు లేని జీరో స్థాయిలో అధికారికంగా పాలనా పగ్గాలు చేపట్టిన నాటి నుంచి నేడు సుమారు రూ.550 కోట్లకు పైగా విలువచేసే స్థిరాస్తులపై చట్టబద్ధంగా అధికారం చేజిక్కించుకునేస్థాయిదాకా తీసుకువచ్చామన్నారు. ప్రస్తుతం కేసు కోర్టులో వాదపోవాదనలో ఉన్నాయన్నారు. కొంతమంది షేర్‌హోల్డర్స్ డిపాజిట్‌దారులను ఆందోళనకు గురి చేసేలా పాలకవర్గంపై లేని పోని నిరాధార ఆరోపణలు, ప్రకటనలు చేస్తున్నారని, అంతా పారదర్శకంగా నడుస్తోందన్నారు. తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సొసైటీలో 9 మంది డైరెక్టర్లు ఉండగా వారంతా బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తున్నారన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ పీవీ రమణమూర్తి, డైరెక్టర్లు జోస్యుల స్వామిప్రసాద్, ఏవీఎస్ రవికుమార్, కె.గౌరీ శంకర్, అల్లంరాజు గవరాజుకుమార్, కాట్రగడ్డ సురేష్, చింతా సుబ్బారావు, అముజూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెట్రోల్ పోసి నిప్పంటిస్తా

పి.రాయవరంలో పెట్రోల్ బాటిల్‌తో వ్యక్తి హల్‌చల్

పిఠాపురం రూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): తాను పనిచేసిన కాలానికి తక్షణం జీతాలు చెల్లించకుంటే పెట్రోల్ పోసి నిప్పంటిస్తానని బెదిరించడమే గాక ఉద్యోగులను సచివాలయంలో ఉంచి బయట పెట్రోల్‌బాటిల్ పట్టుకుని హల్‌చల్ చేశాడు ఒక వ్యక్తి. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం పి.రాయవరం సచివాలయంలో శనివారం జరిగిన ఈ సంఘటనపై పంచాయతీ కార్యదర్శి ప్రియాంక మయూరి, ఇతర ఉద్యోగులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాయవరం గ్రామపంచాయతీలో కాటూరి లోవ సత్తిబాబు గతంలో క్లాప్‌మిత్రగా పనిచేశాడు. తాను చేసిన కాలానికి జీతం ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి ప్రియాంకను డిమాండ్ చేశాడు. తాను ఇటీవలే వచ్చానని, ఇంకా చార్జి తీసుకోలేదని తెలపగా దీంతో ఆగ్రహించిన సత్తిబాబు అక్కడే ఉన్న కాంట్రాక్టు ఉద్యోగి రాజబాబుపై పెట్రోల్ పోసి నిప్పు అంటిస్తానని బెదిరించాడు. పెట్రోల్‌బాటిల్‌తో వచ్చిన అతడిని చూసి ఉద్యోగులందరూ భయభ్రాంతులకు గురయ్యారు. కార్యాలయం తలుపులు వేసి పెట్రోల్ బాటిల్‌తో అక్కడే కూర్చోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చినా అతడు వెనక్కి తగ్గలేదు. ఈ సంఘటనపై పంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శనివారం రాత్రి కేసు నమోదు చేశారు.



పెట్రోల్ బాటిల్‌తో హల్‌చల్ చేస్తున్న సత్తిబాబు

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

FINANCE

గవర్నమెంట్ రిటైర్డ్ పెన్షనర్స్‌కు (కేంద్ర/రాష్ట్ర), ప్రభుత్వ ఉద్యోగస్తులకు (కేంద్ర / రాష్ట్ర) సులభ వాయిదాల పద్ధతిలో వెంటనే ఫైనాన్స్ చేయబడును. వెంకటేశ్వర ఫైనాన్స్. Govt. Reg.No.176/2019. Cell: 9550648668

AJD:207810

PLOT FOR SALE

కాకినాడ రూరల్ సూర్యారావుపేట అచ్యుతపురం జన చైతన్య లే అవుట్ లో పడమర ఫేసింగ్ 220 చ.గ. స్థలం అమ్మకం. సంప్రదించండి: 94410 63975

AJN-228203

షాపు అద్దెకు

పిఠాపురం, కూచేవారి వీధిలో (D.No. 4-1-107) మున్సిపల్ ఆఫీస్ అంబికాహోటల్ ఎదురుగా బ్యాంక్స్, ఆఫీస్‌లు మంచి వ్యాపార అభివృద్ధికి అనువుగా ఉండే 12/60 సైడ్ షాపు అద్దెకు ఇవ్వబడును. Cell: 9848147736

AJD:199945

TO-LET


Bank లకు, Corporate office లకు, Dental Hospital లకు అనువుగా ఉండే దానవాయిపేట 1st Floor సుమారు 1600 sft, పార్కింగ్‌తో అద్దెకు కలదు. Cell: 94908 11769

AJD:199643



ఏఎస్ఆర్ టోర్నీ విజేత ఐటీ చెన్నై

- గొల్లవిల్లిలో ముగిసిన వాలీబాల్ పోటీలు
- మహిళా విజేత ఆంధ్రా జట్టు



ఆంధ్రా, తెలంగాణ మహిళల జట్ల మధ్య పోరు



విజేతకు కప్ బహూకరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, టోర్నీ అధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ

ఉప్పలగుప్తం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా గొల్లవిల్లిలో జరుగుతున్న అరిగెల శ్రీరంగయ్య జాతీయ వాలీబాల్ పోటీల్లో ఐటీ చెన్నై విజేతగా నిలిచింది. ద్వితీయ, తృతీయ స్థానాలను జీఎస్టీ(ముంబై), ఐబీ(చెన్నై) గెలుచుకున్నాయి. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టోర్నీ అధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ బహుమతి ప్రదానం చేశారు. నాల్గవ రోజు శనివారం పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీలు తిలకించేందుకు పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. అతిథులను టోర్నమెంట్ అధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, సతీమణి నాగరత్నకుమారి, ముఖ్య సలహాదారు అరిగెల నానాజీ ఘనంగా సత్కరించారు. హాజరైనవారిలో టోర్నీ గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, జడ్పీ మాజీ చైర్మన్లు జ్యోతుల నవీన్, నామన రాంబాబు, డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, ఆర్యవైశ్య సంఘం డైరెక్టర్ కంకటాల రామం, పలువురు కూటమి నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు. మొదటి మ్యాచ్ ఆంధ్రా, తెలంగాణా మహిళా జట్ల మధ్య జరిగింది. ఆంధ్రా జట్టు విజేతగా నిలిచింది.

వాలీబాల్‌ను ఆదరిస్తున్న తీరు అద్భుతం

తెలంగాణ మహిళా జట్టు కోచ్ రమాదేవి



గొల్లవిల్లిలో వాలీబాల్ క్రీడలను ఆదరిస్తున్న తీరు అద్భుతమని తెలంగాణ మహిళల జట్టు కోచ్, గోల్డ్ మెడలిస్ట్ జి.రమాదేవి వ్యాఖ్యానించారు. మారుమూల పల్లెలో 4 దశాబ్దాలుగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించడం సాహసోపేతమన్నారు. శనివారం తెలంగాణ క్రీడాకారిణులు స్థానిక అరిగెల వెంకటనరసింహారావు కొబ్బరితోట, వరి పొలాల్లో ఆనందంగా కాలక్షేపం చేశారు. కోచ్ రమాదేవి ఆంధ్రజ్యోతికి గొల్లవిల్లి అరిగెల శ్రీరంగయ్య నేషనల్ వాలీబాల్ టోర్నమెంటుపై తన అభిప్రాయాన్ని వెల్లడించారు. వీఎఫ్‌ఐ నియమనిబంధనలకు అనుగుణంగా టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్న దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, టోర్నీ కార్యవర్గాన్ని అభినందించారు. జాతీయ పోటీలు నిర్వహిస్తున్న గొల్లవిల్లి వాలీబాల్ కోర్టు అంతర్జాతీయ వేదిక కావాలని ఆకాంక్షించారు. ఆహారం, వసతుల కల్పనలో నిర్వాహకులు చూపిస్తున్న ఆదరణ దేశం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు మరిచిపోలేరన్నారు. గొల్లవిల్లి టోర్నమెంట్‌లో పాల్గొనే అవకాశం కల్పించిన టోర్నీ గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శి గొలకోటి ఫణీంద్రకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

గోల్డ్ హంట్ పేరిట యూట్యూబర్ హంగామా

స్టేడియంలో అనధికారికంగా గుంతలు తవ్విన యువకులు

కేసు నమోదు చేసిన పోలీసులు

అమలాపురం రూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో గోల్డ్ హంట్ పేరుతో ఓ యూట్యూబర్ చేసిన హంగామాపై శనివారం అమలాపురం తాలూకా పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. బాలయోగి స్టేడియంలో శుక్రవారం మధ్యాహ్నం మందపాటి ఆదిత్య అనే వ్యక్తి తన ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్స్ కోసం గోల్డ్ హంట్ టాస్క్‌తో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బాలయోగి స్టేడియంలో బంగారం దాచి పెట్టానని, ఆ బంగారాన్ని కనుగొన్నవారికి మొదటి బహుమతిగా బంగారు ఆభరణం, రెండో బహుమతిగా వెండి, మూడో బహుమతిగా ఇయర్ బడ్స్ అందించనున్నట్టు ప్రకటించారు. దాంతో పరిసర ప్రాంతాలకు చెందిన యువకులు అనధికారికంగా స్టేడియంలోకి ప్రవేశించి గోల్డ్ హంట్‌లో భాగంగా ఎక్కడ పడితే అక్కడ గుంతలు తవ్వేశారు. ఈ వ్యవహారంపై స్టేడియం అధికారులు ఫిర్యాదు మేరకు మందపాటి ఆదిత్యపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

జీజీహెచ్‌లో మరో జీబీఎస్ కేసు

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో మరో గులియన్- బారే సిండ్రోమ్ (జీబీఎస్) కేసు నమోదైనట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఎస్ లావణ్యకుమారి తెలిపారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరానికి చెందిన 52 ఏళ్ల పురుషుడు జీబీఎస్ లక్షణాలతో చేరినట్టు వెల్లడించారు. శనివారం నమోదైన కేసుతో కలిపి మొత్తం ముగ్గురు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్టు పేర్కొన్నారు. వారిలో ఇద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఒకరి పరిస్థితి ఆందోళన కరంగా ఉన్నట్టు తెలిపారు. జీజీహెచ్‌లో జీబీఎస్ కేసులకు సంబంధించి వైద్య చికిత్స, మందులు, వ్యాక్సిన్, మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయన్నారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

7 వరకూ మహిళా సాధికారత వారోత్సవాలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహణ: ఎస్పీ కిషోర్


వైద్య శిబిరంలో పాల్గొన్న మహిళా సిబ్బంది

రాజమహేంద్రవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 1 నుంచి 7 వరకూ జిల్లాలో మహిళా సాధికారత వారోత్సవాలను నిర్వహిస్తున్నామని ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. వారోత్సవాల్లో భాగంగా అన్ని పోలీస్ స్టేషన్లలో ఓపెన్ హౌస్ నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థినులకు మహిళల భద్రత, పోలీసు విధుల పట్ల అవగాహన కల్పించడమే ఉద్దేశమన్నారు. అలాగే మెడికల్ క్యాంపులు, వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖనం, ర్యాలీలు ఉంటాయని పేర్కొన్నారు.

వైద్య శిబిరం

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలోని మహిళా సిబ్బంది కోసం విజన్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని అడిషనల్ ఎస్పీలు ఎన్‌బీఎం మురళీకృష్ణ (పరిపాలన), ఏవీ సుబ్బరాజు(శాంతి భద్రతలు), ఎల్.అర్జున్(నేరాలు) పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో ప్రత్యేకంగా మహిళా సిబ్బంది ఆరోగ్య సంరక్షణకు ఈ మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశామన్నారు. ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉన్నప్పుడే విధులను సక్రమంగా నిర్వహించడం సాధ్యమవుతుందన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

గోకవరం, మార్చి1(ఆంధ్రజ్యోతి): మహిళలు, విద్యార్థినులు చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్, సీఐ వై.సత్య కిషోర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా వివిధ కళాశాలలో చదువుతున్న హస్టల్ విద్యార్థినులతో శనివారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా స్టేషన్‌లో రిసెప్షన్, మహిళా రక్షక్, డయల్ 112, ఎఫ్ఐఆర్, లాకప్, వీహెచ్‌ఎఫ్ కమ్యూనికేషన్ సెట్, ఫోక్సో కేసులు, ఆర్టీఐ యాక్ట్, గంజాయి, డ్రగ్స్ తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

పేదలకు ప్రభుత్వం బాసట

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీలో ఎమ్మెల్యేలు గోరంట్ల, నల్లమిల్లి


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యేలు గోరంట్ల, నల్లమిల్లి

రాజమహేంద్రవరం రూరల్,మార్చి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదలకు కూటమి ప్రభుత్వం బాసటగా ఉంటోందని ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాజవోలు గ్రామానికి చెందిన సోడదాసి రమణ, కీర్తన దంపతుల కుమార్తె అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరింది. వైద్యం కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కుటుంబానికి రూ.10 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును గోరంట్ల నివాసంలో ఎమ్మెల్యేలు గోరంట్ల, నల్లమిల్లి శనివారం సాయంత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యఖర్చులు భారమై ఇబ్బందులు పడుతున్న పేదలకు ఆపన్నహస్తం అందించేందుకు ప్రభుత్వం అన్నివిధాలుగా కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నర్సిపల్లి హారిక తదితరులు పాల్గొన్నారు.

జీవితం సప్తస్వర సంగమం

'సంకీర్తనశ్రీ' గోపికృష్ణ


సంగీత కార్యశాలలో మాట్లాడుతున్న గోపికృష్ణ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి స్వరం శరీరంలోని ఏడు చక్రాలతో సంధించబడతాయని, జీవితం సప్తస్వర సంగమం అని సంకీర్తన చీమలమర్రి గోపికృష్ణ అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన సంగీత కార్యశాలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. సప్తస్వరాలు ఆరోహణ మాదిరిగా శరీర చక్రాలు ఆరోహణ పద్ధతిలోనే చెప్పబడ్డాయని, కోమల స్వరాలు ఎడమవైపు చక్రాలతో (ఇడ, పింగళ, శుషుమ) సంధించబడితే శుద్ధ, తీవ్ర స్వరాలు కుడివైపు చక్రాలతో అనుసంధించబడ్డాయని వివరించారు. ప్రతి రాగం అనుసంధించబడిన చక్రంతో ప్రభావితమవుతాయని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డీవీ రమణమూర్తి, తెలుగు శాఖ అధిపతి పీవీబీ సంజీవరావు మాట్లాడారు. కార్యక్రమంలో జి.శరత్‌బాబు, వై.స్వర్ణశ్రీ, చీమలమర్రి శ్రీనివాస్, పల్లి సుధా, ఏ.సరళ, ఎస్.రాజకుమారి, సుగుణ పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టిద్దాం

ఈవోపీఆర్డీ వెంకటరత్నం

రంగంపేట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద సృష్టిద్దామని, అందుకు గ్రామస్థులు తడి చెత్తను, పొడి చెత్తను వేర్వేరుగా పంచాయతీ సిబ్బందికి అందించి సహకరించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి విస్తరణాధికారి(ఈవోపీఆర్డీ) పి.వెంకటరత్నం అన్నారు. శనివారం మండలంలోని వడిశలేరులో గ్రామస్థులతో మాట్లాడారు. మార్చి 1 నుంచి మండలంలో 17 పంచాయతీల్లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ జరుగుతుందన్నారు. తడి చెత్తను, పొడి చెత్తను వేర్వేరుగా భద్రపరిచి పారిశుధ్య సిబ్బంది వచ్చినప్పుడు వారికి అందించాలన్నారు. వడిశలేరులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ఉందని, దానిలో వర్మీకంపోస్టు తయారీ చేస్తున్నామని, తద్వారా చెత్త నుంచి సంపద తయారు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కడియం: మండలంలోని వేమగిరిలో గ్రేడ్-1 కార్యదర్శి ఎం.రూప్‌చంద్ ఆధ్వర్యంలో శనివారం తడిచెత్త, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈవోపీఆర్‌డీ ఎం.రామ్‌ప్రసాద్ విచ్చేసి పర్యవేక్షించారు. చెత్త సేకరణపై ఇంటింటికీ విస్తృత ప్రచారం నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అవసరమైతే ఫ్లెక్సీలు, మైకుల ద్వారా ప్రసారాలను చేపట్టాలన్నారు. పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. సేకరించిన చెత్తను చెత్త నుంచి సంపద కేంద్రం ద్వారా ఏ విధంగా వినియోగిస్తున్నారో రామ్‌ప్రసాద్ పరిశీలించారు.

చైతన్యరాజుకు ప్రముఖుల పరామర్శ


లక్ష్మీకాంతమ్మ చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న రాజకీయ ప్రముఖులు

రాజానగరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మాతృవియోగంతో బాధపడుతున్న చైతన్య సంస్థల వ్యవస్థాపక చైర్మన్, గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ) కులపతి కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు)ను భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ జీజీయూ ప్రాంగణంలోని తన నివాసంలో శనివారం కలిసి పలకరించారు. చైతన్యరాజు మాతృమూర్తి కలిదిండి లక్ష్మీకాంతమ్మ గత నెల 20న వృద్ధాప్యంతో మృతిచెం దారు. ఈ నేపథ్యంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు, ఆదికవి నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్ జి.సుధాకర్, పాండిచ్చేరి ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు తాటిపాక మధు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సత్యనారాయణరాజు, బీజేపీ రాజానగరం నియోజకవర్గ కన్వీనర్ నీరుకొండ వీరన్నచౌదరి తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంతమ్మ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి, ప్రగాఢ సంతాపం తెలిపారు.

భేటీ బచావో

పుష్కరఘాట్ నుంచి దేవీచౌక్ వరకూ మహిళల బైక్ ర్యాలీ


రాజమహేంద్రవరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బాలికల విషయంలో సమాజంలో అంతర్లీనంగా ఉన్న వివక్ష తొలగేలా ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా శనివారం సాయంత్రం రాజమహేంద్రవరం నగరంలో మహిళలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. పుష్కరఘాట్ నుంచి దేవీచౌక్ వరకూ ఈ బైక్ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారిణి కె.విజయకుమారి మాట్లాడుతూ భేటీ బచావో, భేటీ పఢావో కార్యక్రమం ద్వారా పౌరుల ఆలోచనా ధోరణిని మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆడపిల్లల విద్య, వారి సామాజిక భాగస్వామ్యం సమాజ పరిణామక్రమంలో ఎంతో ప్రాధాన్యం కలిగి ఉందని పేర్కొన్నారు. అదనపు ఎస్పీ సుబ్బరాజు, డీఎస్పీలు భవ్యకిశోర్, బి.విద్య, మహిళా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మంగాదేవి, ఎస్ఐ అమీనాబేగం, ఐసీడీఎస్ అధికారులు, మహిళా పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

బడ్జెట్..రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాది

ఎమ్మెల్యే నల్లమిల్లి


అనపర్తి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర పునర్నిర్మాణానికి పునాదిలా ఉందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం అనపర్తిలోని కూటమి కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలను ఆదుకునే విధంగా బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయన్నారు. గత వైసీపీ పాలకుల విధ్వంసాల నుంచి వ్యవస్థలను పునరుద్ధరింపజేసే దిశగా బడ్జెట్‌ను రూపొందించారన్నారు. అన్ని వర్గాలకు నిధులు కేటాయించారని, అన్నదాత సుఖీభవ పథకానికి రూ.6300 కోట్లు కేటాయించడం ద్వారా రైతులకు మేలు చేకూరుతుందన్నారు. 48వేల కోట్లతో వ్యవసాయ బడ్జెట్‌ను రూపొందించి రైతులకు అండగా నిలిచిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం మాత్రమేనన్నారు. సమావేశంలో సిరసపల్లి నాగేశ్వరరావు, తమలంపూడి సుధాకరరెడ్డి, వేణుగోపాలరెడ్డి, కొవ్వూరి వెంకటరామారెడ్డి, కర్రి బులిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ మెరుగు: వాసు


ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కూటమి సర్కార్ తీసుకునే కీలక నిర్ణయాలతో రాష్ట్రంలో విద్యావ్యవస్థ మెరుగుపడుతుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఓ ప్రకటనలో అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి భారీగా నిధులు కేటాయించిందని, తల్లికి వందనం పథకానికి రూ.9,407 కోట్లు కేటాయించిందన్నారు. 1నుంచి 12 తరగతి వరకు ప్రభుత్వ ప్రైవేట్ స్కూళ్లలో చదివే విద్యార్థులకు ఏటా రూ.15 వేలు ఈ పథకం కింద ఆర్థిక సాయం అందించనుందని, ఒక ఇంట్లో ఎంత మంది విద్యార్థులున్నా అందరికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. తల్లిదండ్రులను మోసం చేసిన వైసీపీ ఇప్పుడు ఈ పథకంపై తప్పుడు ప్రచారం చేస్తోందని ప్రజలు నమ్మవద్దని ఎమ్మెల్యే వాసు పేర్కొన్నారు.

నాయీబ్రాహ్మణులకు పెద్దపీట


సమావేశంలో మాట్లాడుతున్న దాస్యం ప్రసాద్

రాష్ట్ర బడ్జెట్‌లో నాయీబ్రాహ్మణులకు పెద్దపీట వేసారని నాయీబ్రాహ్మణ నేత, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం బడ్జెట్‌లో రూ.450 కోట్లు కేటాయించడం కూటమి ప్రభుత్వానికి తమ సామాజిక వర్గంపై ఉన్న ప్రత్యేక శ్రద్ధను చాటుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం మరుగున పడేసిన ఆదరణ-2 పథకాన్ని కూటమి ప్రభుత్వం పునఃప్రారంభిస్తూ దానికి రూ.1000 కోట్లు కేటాయించారన్నారు. తమకు ఎండోమెంట్ కమిటీల్లో అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాయీబ్రాహ్మణ సాధికార సమితి నగర అధ్యక్షుడు అలజంగి దేవుడు, కందికొండ అనంత్, పెండ్యాల నాగేశ్వరరావు, కోరుపల్లి నాగేశ్వనరావు, కోటిపల్లి చంద్రశేఖర్, వీవీవీ శ్రీనివాస్, కనకరాజు పాల్గొన్నారు.

రంగంపేటలో 675 మంది హాజరు

» ఇంటర్ పరీక్షలు ప్రారంభం
» పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాట్లు


అనపర్తిలో హాల్ టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు

రంగంపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియేట్ పరీక్షలు శనివారం ప్రాంభమయ్యాయి. రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో మొదటి రోజు ఫస్టియర్ తెలుగు పరీక్షకు 708 మందికి గాను 675 మంది విద్యార్థులు హాజరు కాగా 33 మంది గైర్హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌లు బి.హేమ, ఎస్.మాధురి తెలిపారు. ఏపీఆర్‌వీ ప్రసాద్, ఎంవీఎస్ కృష్ణ డీవోలుగా వ్యవహరించారన్నారు.

అనపర్తిలో 70మంది గైర్హాజరు

అనపర్తి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అనపర్తిలో ఏర్పాటు నాలుగు సెంటర్లను చేశారు. మొత్తం 1262 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 70 మంది గైర్హాజరయ్యారు. స్థానిక జీబీఆర్ కళాశాలలో 438 మందికి గాను 405 మంది, సాయిమాధవి డిగ్రీ కళాశాలలో 348 మందికి గాను 326 మంది, ఎల్ఎన్ పురం రెసిడెన్సియల్ కళాశాలలో 192 మందికి గాను 182 మంది, కొత్తూరు కళాశాలలో 284 మందికి గాను 279 మంది హాజరయ్యారు.

మురమండలో ఏడుగురు

కడియం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురమండలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 175 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 168 మంది హాజరు కాగా ఏడుగురు గైర్హాజరయ్యారని ఎంఈవో వై.నాగేశ్వరరావు తెలిపారు.

గోకవరంలో 736 మంది హాజరు

గోకవరం, మార్చి1(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం ప్రారంభమ య్యాయి. ఈ పరీక్షలకు 477 మంది విద్యార్థులు హాజరుకావలసి ఉండగా 55మంది గైర్హాజరైనట్టు ఎగ్జామ్స్ చీఫ్ సూపరింటెండెంట్ టి.శ్రీనివాస్ తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద ఎస్ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రహరీ లేకపోవడంతో పరీక్ష కేంద్రం చుట్టూ ఎస్ఐ ఇనుప కంచెను ఏర్పాటు చేశారు. అలాగే బీఎస్ఆర్ కళాశాలలో జరిగిన పరీక్షకు 329 మంది హాజరుకావవసి ఉండగా 15 మంది గైర్హాజరయ్యారు.

కోరుకొండలో 564 మంది..

కోరుకొండ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు పటిష్టమైన పోలీస్ బందోస్తు మధ్య ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షకు 594 మంది హాజరుకావాల్సి ఉండగా 564 మంది హాజరయ్యారు. జనరల్ విభాగంలో 455 మందికి గాను 439 మంది, ఒకేషనల్ విభాగంలో 139 మందికి గాను 125మంది పరీక్ష రాశారు. సీఐ సత్యకిషోర్ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద ఎవరు గుమిగూడకుండా 200మీటర్ల వరకు 144 సెక్షన్ విధించారు.


కోరుకొండలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

'జీఎంఆర్' పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రాజమహేంద్రవరం రూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం జరిగింది. కళాశాలలో 1987-2021 వరకు చదువుకున్న విద్యార్థులంతా కలుసుకున్నారు. తొలుత కళాశాలలో కొత్తగా రెనోవేషన్ చేసిన అడ్మిన్, కంప్యూటర్ క్లాస్ రూమ్స్, ఫిజిక్స్ కెమిస్ట్రీ ల్యాబ్‌లు, లైబ్రేరీని సందర్శించారు. ప్రిన్సిపాల్ వి నాగేశ్వరరావు, కంప్యూటర్, మెకానికల్, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌ల హెడ్‌లతో కలిసి కళాశాల అభివృద్ధిపై చర్చించారు. అనంతరం ప్రస్తుత విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బోరుగడ్డ జోసఫ్ ,కోశాధికారి కొంబత్తుల శ్రీనివాస్, రాజ్‌కుమార్‌లు మాట్లాడుతూ అసంపూర్తిగా నిలిచిపోయిన హాస్టల్ భవనాన్ని పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణపై ప్రకటనలిస్తే కఠిన చర్యలు

డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణపై జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, లేబరేటరీలు, స్కానింగ్ సెంటర్లు ఎటువంటి వాణిజ్య ప్రకటనలు ఇచ్చినా చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టం ప్రకారం కఠినమైన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాలమేరకు ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. జిల్లా అప్రోప్రియేట్ అథారిటీలో నమోదైన ఆసుపత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు చట్టంలోని నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే నిర్వాహకులకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ జరిమానా, మూడు నుంచి ఐదేళ్ల వరకూ జైలు శిక్ష పడుతుందన్నారు. జిల్లాలో ఎవరైనా లింగనిర్ధారణకు సంబంధించి అవకతవకలకు పాల్పడితే టోల్ ఫ్రీ నెంబరు 1800 425 3365 నెంబరుకు తెలియజేయాలని సూచించారు.

హైజిన్ విద్యపై అవగాహన

బిక్కవోలు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పందలపాక ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థినులకు ఐటీసీ సంస్థ వారు హైజిన్ విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు బాలశ్రీలక్ష్మి, రమ్యశ్రీ. బాలికలు ఎదుర్కొనే సమస్యలు, ఆరోగ్యం, తీసుకోవాలసిన ఆహార పదార్థాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం జయకృష్ణారెడ్డి, పీడీ యువరాజారెడ్డి, టీచర్ విజయలక్ష్మి, 8, 9, 10 తరగతుల విద్యార్థినులు పాల్గొన్నారు. అనంతరం ఎస్ఎంసీ చైర్మన్ సత్తిరాజు పుట్టినరోజు నిర్వహించారు.

ఏడో తరగతి వారికి పట్టభద్రుల ఓట్లు కల్పించారు

మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్లకు సంబంధించి 7వ తరగతి వారికి కూడా ఓటు హక్కును కల్పించారని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. శనివారం స్థానిక రాజీవ్‌గాంధీ కళాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలు చాలా అక్రమంగా, అన్యాయంగా చేశారని తాము దరఖాస్తు చేయించిన వేలాది మందికి ఓట్లు రాకుండా చేశారన్నారు. ఎప్పుడు ఎన్నికల్లో చంద్రబాబు సర్వశక్తులను ఒడ్డుతారని ఈ ఎన్నికల్లోను అదే చేశారని చెప్పారు. అనర్హులకు ఓటు హక్కు కల్పించిన అంశంలో సంబంధిత ఉద్యోగులు బలౌతారన్నారు. ఎన్నికల్లో స్వయంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ డబ్బులు పంపిణీ చేశారన్నారు. కాషాయం ధరించి ఇటువంటి పనులు చేయడం సిగ్గుచేటన్నారు.

పోలీసుస్టేషన్‌లో 'ఓపెన్ హౌస్'

ధవళేశ్వరం, మార్చి1 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో సీఐ టి.గణేష్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులతో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు.ఎస్ఐ హరిబాబు, క్రాంతికుమార్ పోలీస్‌స్టేషన్ సేవలు, ఎఫ్ఐఆర్ నమోదు, వాడే వెపన్స్ గురించి వివరించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో వైద్య శిబిరాన్ని నిర్వహించి సిబ్బందితో పాటు పలువురికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మం దులు పంపిణీ చేశారు.

'లేపాక్షి'లో క్లియరేన్స్ సేల్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం లేపాక్షి ఎంపోరియంలో ఎంపిక చేయ్యబడిన కొన్ని రకాల వస్తువులపై 10నుంచి 50శాతం వరకు డిస్కౌంట్ ఇస్తున్నామని మేనేజరు జి.మోనిక్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ఎండీ ఎం.విశ్వ ఆదేశాల మేరకు 2024-25 క్లియరేన్స్ సేల్‌లో భాగంగా ఈ డిస్కౌంట్ ఇస్తున్నామన్నారు. మార్చి 1నుంచి 31వ తేదీ వరకు డిస్కౌంట్ సేల్ నడుస్తుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాగమణి ట్యూషన్ సెంటర్లో సైన్స్ ఫెయిర్



రాజమహేంద్రవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కాలనీలోని నాగమణి ట్యూషన్ సెంటర్ విద్యార్థులు జాతీయ సైన్స్ ఫెయిర్ దినోత్సవం సందర్భంగా శనివారం ట్యూషన్ సెంటర్ నిర్వాహకుడు ఎం.వెంకటేశ్ ఆధ్వర్యంలో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పలు ప్రాజెక్టులను ప్రదర్శించారని వెంకటేశ్ తెలిపారు. కార్యక్రమంలో వార్డు ప్రముఖులు బాబి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'ఓపెన్ హౌస్'

కోరుకొండ, మార్చి1(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిడిగట్ల వికాస్ ఫార్మసీ కళాశాల విద్యార్థినులకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఎస్ఐ శ్యామ్ సుందర్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రిసెప్షన్, మహిళారక్షక్, డయల్ 112, ఎఫ్ఐఆర్, లాకప్, వీహెచ్ఎఫ్, కమ్యూనికేషన్ సెట్, ఆర్టీఐ యాక్ట్‌పై అవగాహన కల్పించారు.

ఆస్తిపన్నుల చెల్లింపులకు నేడూ అవకాశం

కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగర పరిధిలో 2024-25 ఏడాదికి సంబంధించిన ఆస్తిపన్నుల చెల్లింపుల కౌంటర్ ఆదివారం కూడా తెరిచే ఉంటుందని మునిసిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ట్రెజరీలో చెల్లింపులకు వెసులుబాటు కల్పిస్తున్నామన్నారు. పన్ను చెల్లింపుదారులు ఆఫ్‌లైన్ లేదా చెక్కుల ద్వారా చెల్లించాలనుకుంటే సీడీఎంఏ.ఏపీ.జీవోవీ.ఇన్ పోర్టల్‌లో చెల్లించవచ్చని తెలిపారు. అలాగే సచివాలయాల్లో పరిపాలనా కార్యదర్శి ద్వారా కూడా పన్నులు చెల్లించవచ్చున్నారు. ఖాళీస్థలము పన్ను, నీటి చార్జీలు చెల్లించవలసిన వారు ఈ సదవకాశం వినియోగించుకోవాలని కమిషనర్ కోరారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

రాజానగరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాజానగరంలోని కామన్ ప్రొడక్షన్ సెంటర్ భవనంలోని స్కిల్ హబ్‌లో మార్చి రెండో వారంలో నిరుద్యోగ యువతీయువకులకు టైలరింగ్, కంప్యూటర్‌లో ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్టు సంస్థ సమన్వయాధికారి గండి సురేష్ శుక్రవారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 45 ఏళ్ల వయసున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సమగ్ర సమాచారం కోసం స్కిల్ హబ్ నందు గానీ లేదా 90636 48365 మొబైల్ నెంబరులో సంప్రదించవచ్చని చెప్పారు.

సాయిసచ్చరిత్ర ప్రవచనాలు

కడియం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వేమగిరి సాయిబాబా ఆలయంలో సాయిసచ్చరిత్ర జ్ఞానయజ్ఞం కార్యక్రమంలో భాగంగా శనివారం 1 నుంచి 51వ అధ్యాయం వరకు సంపూర్ణ సాయిసచ్చరిత్ర కార్యక్రమం నిర్వహించారు. సాయి బాస్వంత్, వరలక్ష్మి, నిర్మలాదేవి, శకుంతల పరమేశ్వర్, కాకర్లపూడి కల్యాణ్, సాయిదాసు, ఎల్‌వీ సుబ్రహ్మణ్యం బృందం ప్రవచనాల ద్వారా సంపూర్ణసాయి చరిత్రను భక్తులకు వివరించారు. సాయంత్రం పేరూరి అలేఖ్య, వల్లూరి కార్తీక నిత్యకల్యాణి నృత్యప్రదర్శన అలరించింది.

భారీ అన్నసమారాధన

కడియం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కడియం శ్రీభ్రమరాంబికా సమేత మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన జరిగింది. మల్లేశ్వర స్వామి కల్యాణోత్సవాలు, శివరాత్రి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి నాని ప్రారంభించారు. ఆలయార్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రామకృష్ణ జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక రామకృష్ణ మఠంలో భగవాన్ శ్రీ రామకృష్ణ 190వ జయంతి ఉత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా మఠంలోహోమం, స్వామి సేవ్యానందజీ మహరాజ్,స్వామి పరిజ్ఞాయానందజీ మహరాజ్, భగవాన్ శ్రీరామకృష్ణ జీవితం, సందేశాలపై ప్రసంగించారు. తదుపరి భజనలు, హారతి, పుష్పాంజలి,, భజనలు, ఆరాత్రికం, శ్రీ రామకృష్ణ బోధామృత గానం జరిగాయి. కార్యక్రమంలో స్వామి గీలాసారానందజీ మహరాజ్, స్వామి రఘువీరానందజీ మహరాజ్, స్వామి ప్రజ్ఞానాధానందజీ మహరాజ్, బ్రహ్మచారి కరణ్ మహరాజ్, భక్తులు, విద్యార్థులు పాల్గొన్నారు. భక్తులందరికీ ప్రసాద వితరణ జరిగింది.

పిచ్చికుక్కదాడిలో చిన్నారికి గాయాలు

గోకవరం, మార్చి1(ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క దాడిలో ఓ చిన్నారి గాయపడింది. స్థానిక సంజయ్ నగర్‌కు చెందిన ఆరేళ్ల బాలిక కొల్లపు లాస్య శనివారం ఇంటి వద్ద ఆడుకుంటుండగా పిచ్చికుక్క దాడి చేసి గాయపర్చింది. వెంటనే కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బహిరంగ ప్రకటన

[illegible] SYED JILANI S/o SYED MOOSA [illegible] SYED NOORJAHAN W/o SYED MOOSA మరియు SYED NAZMA W/o SYED JILANI [illegible] 7 రోజుల్లోగా [illegible]

షెడ్యూలు

E.G.District, Rajahmundry Municipality in TS No 201/2A1 for an extent of 306 Sq Yards of vacant site and RCC building is measured and bounded by
East : Society Main Road 60"
South : Society 1st cross Road 50"
West : Y.Satyanarayana LDC Plot No5 60"
North : BS Peter ADE Plot No7 50"

N.V.B.L.[illegible], అడ్వకేటు,
Cell: 94402 16126 [illegible]


శ్రీపందిరి మహాదేవుడు కోటిలింగాల సత్రం
రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా
ఫోన్ నెం. 0883-247659, ఫోన్: 949100718
సీల్డు టెండరు కమ్-బహిరంగ వేలం ప్రకటన

రాజమహేంద్రవరం సిటీ, కోటిలింగాలపేటలో గల శ్రీపందిరి మహాదేవుడు కోటిలింగాల [illegible] క్రింది తెలిపిన షాపుకు మూడు సంవత్సరముల కాలపరిమితికి గాను లీజుకు ఇచ్చుటకు దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షములో సీల్డు టెండరు-కమ్ బహిరంగ వేలం నిర్వహించబడును.

వ.నెం	వివరములు	తేదీ, సమయం వేలం నిర్వహించు ప్రదేశం	ధరావత్తు సొమ్ము	లీజుకాలం
	రాజమహేంద్రవరం, మెయిన్ రోడ్ డో.నెం.9-20-77, షాపు నెం.2, మధ్యషాపు (L-30'-7", W-11'-6") మేడపై భాగం (L-30'-7", W-23'-3")	ది.10-03-2025వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటలకు శ్రీవారి సత్రం, మెయిన్ రోడ్, రాజమహేంద్రవరం	50,000/-	ది.01-04-2025 నుండి ది.31-03-2028 (3 సం.లకు)

ముఖ్య షరతులు: 1. బహిరంగ వేలం కమ్ సీల్డు టెండరు నందు పాల్గొనదలచినవారు హిందూ మతస్థులై ఉండవలెను. [illegible] 3,00,000/- [illegible] రూ.200/- [illegible]

ది.01-03-2025
రాజమహేంద్రవరం
పి. [illegible]
సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి







మంచు తెరలు..

పగలు ఎండలు దంచేస్తుంటే, అర్ధరాత్రి దాటాక ఉదయం దాకా దట్టమైన మంచు కురుస్తోంది. ఈ మిశ్రమ వాతావరణ పరిస్థితులు కొంతమందిని ఇబ్బంది పెడుతున్నాయి. ఇంకా కొద్దిరోజులు ఈ పరిస్థితి కొనసాగేలా ఉంది. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం తీపర్రులో గ్రామంలో గోదావరి చెంత కనిపించిన మంచు దృశ్యాలివి.. - పెరవలి





జూనియర్ ఇంటర్ పరీక్షల సందర్భంగా రాజమహేంద్రవరం ఎస్‌కేఆర్ కాలేజీ పరీక్షా కేంద్రంలో తమకు కేటాయించిన పరీక్షా గదిని పరిశీలిస్తున్న విద్యార్థులు.. ఆఖరి నిమిషంలో విద్యార్థినుల ఉరుకులుపరుగులు

ఇంటరీ పరీక్షలు.. మొదటి రోజు ప్రశాంతం

రాజమహేంద్రవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా ముగిశాయి. శనివారం జనరల్ విద్యార్థులకు ద్వితీయ భాష పేపర్ 1, 2, వొకేషనల్ విద్యార్థులకు జనరల్ ఫౌండేషన్ కోర్సు పరీక్ష నిర్వహించారు. జనరల్ విభాగంలో 576, వొకేషనల్ 197 మంది గైర్హాజరయ్యారని ఇంటర్ విద్య జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. 51 పరీక్షా కేంద్రాల్లోను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ

773 మంది గైర్హాజరు

జూనియర్ కళాశాలలో పరీక్షల తీరును కలెక్టర్ ప్రశాంతి పరిశీలించారు. విద్యార్థులకు తాగునీరు, అత్యవసర మందులు తదితర అంశాలపై ఆరా తీశారు. తొలి రోజున ప్రశ్నపత్రం కాస్త సులభంగానే ఉందని కొందరు విద్యార్థులు చెప్పారు. షరా మామూలుగానే ఉదయం విద్యార్థులకు ఉరుకులు, పరుగులు తప్పలేదు. విద్యార్థులను తల్లిదండ్రులు ఉత్సాహపరిచి పరీక్షకు పంపించారు.

చికెన్ తిందాం..రా!

చికెన్ లేదా.. నాకు అన్నం వద్దంటూ మారాం చేయని పిల్లలు అరుదు. నాకు లెగ్ పీస్ కావాలమ్మా అంటూ ముందే రిజర్వు చేసుకునే టీనేజర్లు.. చికెన్ ఫ్రై చేయనా, కర్రీనా అంటూ కిచెన్‌లోంచే ఆఫర్ ఇచ్చే ఇల్లాలు.. ఈలోగా హోటల్‌కెళ్లి దమ్ బిర్యానీ తిందామా అంటూ ఇంటాయన బంపర్ ఆఫర్. ఆదివారం వచ్చిందంటే.. మాంసాహారం తినే వారి ప్రతి ఇంట్లో ఓ చికెన్ మేళానే. పండగన్నా, ఫంక్షనన్నా చికెన్ వెరైటీస్‌తో మరో మెగా మేళా. బలం కోసం గుడ్లు తినండి.. ఓ సలహా. పౌష్టికాహారంలో గుడ్డుదే తొలి మెనూ. ఒక్కే ఒక్క భయం అన్నిటినీ దూరం చేసేసింది. బర్డ్‌ఫ్లూ వైరస్‌తో కోడిమాంసం, గుడ్ల వ్యాపారాన్ని కుప్పకూలేలా చేసింది. వైరస్‌తో కోళ్లు చనిపోయిన మాట వాస్తవం. కానీ దాని ప్రభావం మనుషులపై చూపలేదు. కేవలం భయాందోళనే చికెన్‌ను దెబ్బతీసింది. నెలరోజుల్లో కోట్లలో వ్యాపారం దెబ్బతింది. ఇప్పుడిప్పుడే మళ్లీ జనం చికెన్ వైపు మళ్లేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పరిశ్రమ కూడా ఉచిత చికెన్ మేళాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడానికి అనేక పట్టణాల్లో విస్తృత ప్రచారం చేసింది. మరి ఈ ఆదివారం ఆ ప్రభావం ఏ మేరకు ఉంటుందో చూడాలి.

- ఊరూవాడా పౌల్ట్రీ రంగం ప్రచారం
- బర్డ్‌ఫ్లూతో కోట్లతో నష్టపోయిన పరిశ్రమ
- ఉచిత మేళాలు గట్టెక్కిస్తాయనే ఆశలు
- కోలుకుంటేనే అనుబంధ వ్యాపారాలకూ జోరు
- ప్రస్తుతానికి మటన్, చేపలు, రొయ్యలదే హవా
- వేడుకల్లో 'మటన్' మెనూతో పెనుభారం
- చికెన్ ఉంటేనే నాన్‌వెజ్ ప్రియులకు పండగ



సండే 'స్పెషల్'



పిఠాపురంలో చికెన్ మేళా

(అమలాపురం/అనపర్తి/పిఠాపురం/మండపేట/కొవ్వూరు-ఆంధ్రజ్యోతి)

బర్డ్‌ఫ్లూ వ్యాప్తి ప్రచారంతో దాదాపు నెల రోజులపాటు కోడిమాంసం, గుడ్ల వ్యాపారం పడిపోయింది. అధికారులు, వైద్యులు, పరిశ్రమకు చెందినవారు ఎంత అవగాహన కల్పించినా జనం చికెన్ తినేందుకు ఇష్టపడలేదు. కనీసం గుడ్లు తినాలన్నా భయపడే రోజులు కొనసాగాయి. ఇది పౌల్ట్రీ పరిశ్రమకు పెద్ద దెబ్బ. కేవలం భయాందోళన వల్ల జరిగిన భారీ నష్టమిది. పేదవర్గాలు సైతం కోడిమాంసం తినేందుకు ముందుకు రాలేదంటే దాని ప్రభావం ఏమేరకు చూపిందో అర్థం చేసుకోవచ్చు. తూర్పుగోదావరి జిల్లాలోని పెరవలి మండలం బర్డ్‌ఫ్లూ లక్షణాలతో కోళ్లు పెద్దఎత్తున చనిపోవడంతో ఈ విషయం తొలుత బయటకొచ్చింది. ఆ తర్వాత ఈ జిల్లాలో మరికొన్ని పౌల్ట్రీ ఫారాల్లోనూ బర్డ్‌ఫ్లూ లక్షణాలతో కోళ్లు చనిపోవడంతో వెంటనే కోడిమాంసం, గుడ్లు తినొద్దంటూ జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కాకినాడ జిల్లాలో కూడా కొన్నిచోట్ల ఇదే పరిస్థితి తలెత్తడంతో కాకినాడ జిల్లాతోపాటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోనూ కొంతకాలం చికెన్ తినొద్దంటూ కలెక్టర్లు ఆదేశించారు. ఇందులో కోనసీమ జిల్లాలో ఈ ప్రభావంతో చనిపోయిన కోళ్లు పెద్దగా లేవు. అలాగే ఈ మూడు జిల్లాల్లో పౌల్ట్రీల్లో పనిచేసే కూలీలకు శ్వాబ్ పరీక్షలు చేస్తే ఏ ఒక్కరికీ బర్డ్‌ఫ్లూ లక్షణాలు సోకలేదు. దీంతో వెంటనే కోడిమాంసం, గుడ్లు తినొచ్చంటూ అధికారులు, వైద్యులు చెబుతూ వచ్చారు. కానీ జనం మాత్రం చికెన్ అంటే భయపడుతూనే వచ్చారు. పౌల్ట్రీ పరిశ్రమ పెద్దలు కూడా రంగంలోకి దిగి ఉచిత చికెన్ మేళాలు నిర్వహించి ప్రచారం చేశారు. ఆయా కార్యక్రమాలకు జనస్పందన కూడా బావుంది. చికెన్, గుడ్ల కోసం అన్నిచోట్లా పెద్దఎత్తున జనం ఎగబడ్డారు. ఈ అవగాహన ఎంతవరకు ఫలిస్తుందో, దాని ప్రభావం ఏమేరకు ఉంటుందో వేచిచూడాలి.

చికెన్ షాపులు వెలవెల

బర్డ్‌ఫ్లూ ఎఫెక్టుతో చాలా చికెన్ షాపులు మూతపడ్డాయి. గత వారం నుంచే చాలామంది చికెన్ దుకాణాల్లో ఓమోస్తరుగా అమ్మకాలు చేస్తున్నారు. కొవ్వూరు పట్టణంలో సాధారణంగా 15 రోజుల్లో పది వేల కోళ్లు విక్రయించేవాడు. గత పక్షం రోజుల్లో కేవలం 500 కోళ్లను మాత్రమే విక్రయించాడంటే చికెన్ అమ్మకాలు ఏ స్థాయిలో పడిపోయాయో అర్థంచేసుకోవచ్చు. పిఠాపురంలో మరో చికెన్ షాపు నిర్వాహకుడు మాట్లాడుతూ తాను ఆదివారం నాడు 2వేల కిలోల వరకూ అమ్మేవాడినని, అది వంద కిలోలకు పడిపోయిందని వాపోయాడు. అలాగే కిలో చికెన్ స్కిన్‌లెస్ నెల కిందట రూ.220 వరకు విక్రయించగా, ప్రస్తుతం ప్రాంతాన్ని బట్టి రూ.150 నుంచి రూ.180 మధ్య అమ్ముతున్నారు. అయినాగానీ అమ్మకాలు అంతంత మాత్రమే.

ఫంక్షన్లలో మటన్ మెనూలు

బర్డ్‌ఫ్లూ కారణంగా చికెన్ విక్రయాలు తగ్గి అంతా మటన్, చేపలు, రొయ్యలు, పీతల వంటి వాటిపై పడ్డారు. ఫలితంగా వాటి ధరలు పెరిగిపోయాయి. మటన్ కిలో రూ.800 ఉండే ధర రూ.వెయ్యికి, కొన్నిచోట్ల రూ.1100 వరకు పెరిగిపోయింది. చేపలు, రొయ్యల ధరలూ అదేవిధంగా పెరిగిపోయాయి. ఇది పెళ్లిళ్ల సీజన్. వివాహ రిసెప్షన్లు ఉంటే నాన్‌వెజ్‌తోనే వంటకాలు సిద్ధం చేస్తున్నారు. ఇతర ఫంక్షన్లలోనూ నాన్‌వెజ్ వంటకాలే ఉంటున్నాయి. వీటి అన్నిటిపైనా చికెన్ ప్రభావం పడింది. ఆయా వేడుకల మెనూలో చికెన్‌ను కొందరు నామమాత్రంగా పెడితే, కొందరు పూర్తిగా మటన్, చేపలు, రొయ్యల వంటకాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. వెళ్లిన వారు కూడా మటన్‌పైనే మక్కువ చూపడంతో ఆమేరకు తగిన పరిమాణంలో సిద్ధం చేయాల్సి వస్తోంది. దీంతో ఆయా వేడుకల ఖర్చు తడిసిమోపెడవుతోంది. ఇది ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్టుంది.



పుట్టగొడుగులకూ డిమాండే

అమలాపురం రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ దెబ్బకు చికెన్ వినియోగదారులు తగ్గిపోయారు. మార్కెట్‌లో ఉదయం వేలాడదీసిన కోళ్ల అమ్మకాలు రాత్రి అయినా పూర్తికాని పరిస్థితి. మార్కెట్‌లో ప్రస్తుతం చేపలు, మటన్ అమ్మకాలు పెరిగినమాట వాస్తవమే. గోదావరి, సముద్రపు చేపల ధరలతోపాటు మటన్ రేటు కూడా పెరిగిపోవడంతో అందరూ కొనుగోలు చేయలేని పరిస్థితి. దీంతో మాంసాహార ప్రియులుతక్కువ ధరకు దొరికే మష్రూమ్స్ (పుట్టగొడుగులు) లేదా పన్నీర్ వంటకాలపై దృష్టి సారించారు. మార్కెట్‌లో పన్నీర్ రూ.90 నుంచి రూ.100కు విక్రయిస్తున్నారు. మష్రూమ్స్ ప్యాకెట్ రిటైల్‌గా రూ.20కే దొరుకుతుండడంతో మాంసాహార ప్రియులు తమ వంటకంగా పుట్టగొడుగులను ఎంచుకున్నారు. ఈ రెండు వంటకాలు వేటికవే ప్రత్యేకం కావడంతో ఆదివారం తక్కువ ఖర్చుతోనే విందు చేసుకుంటున్నారు.

హోటళ్లలో బెటర్.. ఫాస్ట్‌ఫుడ్‌లన్నీ మటాష్

సాధారణంగా హోటల్ ఫుడ్ ఇష్టపడేవారంతా చికెన్‌తో పదుల సంఖ్యలో చేసే వెరైటీల కోసమే వెళతారు. బిర్యానీల్లోనూ ఎన్నో వెరైటీలు. బర్డ్‌ఫ్లూతో చికెన్ వంటకాలపై తీవ్ర ప్రభావం పడింది. ఇప్పుడిప్పుడే చికెన్ బిర్యానీలు, వంటకాలకు కాస్త గిరాకీ తగులుతోందని, అది కూడా నాణ్యతలో పేరున్న హోటళ్లకే పరిమితమని ఒక హోటల్ నిర్వాహకుడు తెలిపాడు. కేవలం చికెన్, గుడ్లతోనే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు నడుస్తాయి. అవన్నీ నెలరోజులుగా బేరం లేక మూలనపడ్డాయి. బహుశా వారం పదిరోజుల్లో సాధారణ స్థితి నెలకొంటుందని వారు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

గుడ్డిలో మెల్ల... గుడ్డు ధర

బర్డ్‌ఫ్లూ ప్రభావంతో కోళ్ల పరిశ్రమ అతలాకుతలం అవుతున్న తరుణంలో గుడ్ల ఎగుమతులపై తొలుత ప్రభావంపడినా మెల్లమెల్లగా ఎగుమతులు ఊపందుకున్నాయి. నెలరోజుల కిందట రూ.4 దిగువకు చేరుకున్న గుడ్డు ధర ప్రస్తుతం రూ.4.80కు చేరుకోవడంతో రైతులు ఊపిరిపీల్చుకుంటున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చాలా ప్రాంతాల్లో కోళ్లకు నష్టం లేకపోయినా వినియోగం తగ్గడంతో తీసేయాల్సిన లేయర్ బ్యాచ్‌లు బయటకు వెళ్లక రైతులపై భారం పడుతోంది.

చికెన్ మేళాలు ఉపకరిస్తాయా..

కోడిమాంసం కూర గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో ఉడికించి తింటే ఒకవేళ వైరస్ లక్షణాలు ఉన్నా ఏమీ కాదని వైద్యులు చెబుతున్నారు. గుడ్లు కూడా పూర్తిగా ఉడకబెట్టుకుని లేదా వండుకుని తినొచ్చని చెప్పారు. పౌల్ట్రీ సంఘాలు కూడా రంగంలోకి దిగి ఉచిత చికెన్, గుడ్లు మేళాలు నిర్వహించగా, జనం వాటి కోసం పెద్దఎత్తున ఎగబడ్డారు. ఇది పూర్తి సానుకూల పరిస్థితి ఉంటుందనే ఆశాభావంతో వారంతా ఉన్నారు.

ఫించను.. అదే జోరు

12గంటల్లో 96శాతం పంపిణీ
పించను పంపిణీ చేసిన కలెక్టర్



బూరుగుపూడిలో ఫించన్లు పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం/కోరుకొండ మార్చి1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచీ ఠంచనుగా పింఛను పంపిణీ జరుగుతోంది. ప్రతి నెలా అదే జోరుతో యంత్రాంగం సిద్ధమవుతోంది. కొద్దిరోజుల ముందు నుంచే కలెక్టర్ ప్రశాంతి నేతృత్వంలో డీఆర్డీఏ పీడీ మూర్తి పర్యవేక్షణలో కసరత్తు చేస్తుండడంతో అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు. శనివారం ఉదయం సరిగ్గా ఏడు గంటలకు సుమారు 5,100 మంది సచివాలయ తదితర శాఖల ఉద్యోగులు రంగంలోకి దిగారు. ఇంటింటికీ వెళ్లి సామాజిక భద్రతా పింఛను చేతిలో పెట్టారు. దీంతో ఉదయం 11 గంటలకే 85శాతం పంపిణీ పూర్తయింది. జిల్లాలో మొత్తం 2,35,344 మంది పింఛను లబ్ధిదారులు ఉండగా సాయంత్రం 7 గంటల సమయానికి 2,24,890 మందికి రూ.97 కోట్ల 23 లక్షల 33వేల 500 పంపిణీ చేశారు. 12 గంటల్లో 96 శాతం మందికి పింఛను డబ్బులు ఇంటికి వెళ్లి అందజేశారు. ఒకవేళ ఇంటి వద్ద ఆ సమయానికి అందుబాటులో లేకపోతే ఫోను చేసి సదరు లబ్ధిదారుడు ఇంటికి వచ్చే సమయానికి వెళ్లి పింఛను అందజేస్తున్నారు. వారు రాలేని పక్షంలో వారి వద్దకే వెళ్లి ఇస్తున్నారు. పింఛను పంపిణీలో జిల్లాలో రాజమహేంద్రవరం అర్బన్ మొదటి స్థానంలో ఉండగా తర్వాత స్థానాల్లో వరుసగా కోరుకొండ చాగల్లు, నిడదవోలు అర్బన్, ఉండ్రాజవరం ఉన్నాయి. కోరుకొండ మండలం బూరుగుపూడి పంచాయతీ పరిధిలో అనారోగ్యం వల్ల మంచానికే పరిమితమైన పలువురికి జిల్లా కలెక్టర్ ప్రశాంతి స్వయంగా వెళ్లి పింఛను అందజేశారు.

బెర్లిన్‌లో ఈనెల 4 నుంచి 6 వరకూ
ఐటీబీ బెర్లిన్ -2025.. హాజరుకానున్న
పర్యాటక మంత్రి దుర్గేష్ - మెయిన్‌లో

ప్రతిష్ఠాత్మకంగా జనసేన ఆవిర్భావ సభ



పిఠాపురం మండలం చిత్రాడ శివారులో జనసేన ఆవిర్భావ సభా ప్రాంగణంవద్ద వేదిక నిర్మాణానికి భూమి పూజ అనంతరం జనసేన నేతలతో మంత్రి నాదెండ్ల

- వేదిక నిర్మాణ పనులకు మంత్రి నాదెండ్ల భూమి పూజ
- ఆవిర్భావ సభకు ఘనంగా ఏర్పాట్లు.. 50 ఎకరాల్లో సభ

పిఠాపురం/పిఠాపురంరూరల్, మార్చి1(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఏర్పాటు చేస్తున్న జనసేన ఆవిర్భావ సభను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ శివారు ఎస్‌బీ వెంచర్స్‌లో ఈనెల 14న నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ సభ ఏర్పాట్లకు శనివారం సాయంత్రం శ్రీకారం చుట్టారు. సభా ప్రాంగణం వద్ద వేదిక నిర్మాణ పనులకు నాదెండ్ల, ప్రజాప్రతినిధులు, నాయకులు భూమిపూజ నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు జరిపించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో లభించిన ఈ విజయం ప్రజల కోసమేనని, అదే అంకితభావంతో నిరంతరాయం పనిచేస్తామని సభ ద్వారా తెలియజేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ద్వారా ప్రతి కుటుంబానికి మేలు జరిగేలా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులు పనిచేస్తారన్నారు. రాష్ట్ర ప్రజలకు విజయాన్ని అంకితం చేసేలా సభ ఉంటుందన్నారు. ఆవిర్భావ సభకు ఏర్పాట్లు అన్నీ పకడ్బందీగా ఉండాలన్నారు. 50 ఎకరాల విస్తీర్ణంలో సభను ఏర్పా టు చేయనున్నట్లు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్, శాసనమండలి ప్రభుత్వ విప్ హరిప్రసాద్, కుడా చైర్మన్ తుమ్మలరామస్వామి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, టిడ్కో చైర్మన్ అజయకుమార్, పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, జనసేన పార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ కల్యాణం శివశ్రీనివాసరావు, శాసనసభ ప్రభుత్వ విప్‌లు బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, అరవ శ్రీధర్, నేతలు కడారి తమ్మయ్యనాయుడు, మురాలశెట్టి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఒకటా.. రెండ్రోజులా..

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపే వేరు
- పోలైన ఓట్లలో 51 శాతం ప్రాధాన్యత ఓట్లు లభిస్తే విజేతే
- కాకుంటే ప్రాధాన్యత క్రమంలో గంటల తరబడి లెక్కించాలి
- బ్యాలెట్ పత్రాలు సరిపోల్చుకుని లెక్కించాల్సి ఉన్నందున భారీ జాప్యం
- గత అనుభవాలు చెబుతున్నది ఇదే
- రేపే ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

సాధారణ ఎన్నికలు అలా..

ఐదేళ్లకొకసారి జరిగిన సాధారణ ఎన్నికల్లో ఓటేసేందుకు చాలాకాలం నుంచి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు వాడుతున్నారు. పోలింగ్‌లో వేగం పెంచడం, ఓటర్లకు ఏ సమస్య లేకుండా పారదర్శ కంగా తాము ఎవరికి ఓటేసిందనే విషయం ఒక స్పష్టత వచ్చేలా ఈ పోలింగ్ యంత్రాలను వినియోగిస్తున్నారు. కౌంటింగ్ విషయానికి వచ్చేసరికి వేలల్లో ఉండే ఓట్ల లెక్కింపు గంటల్లో పూర్తవుతుంది. ఆ వెను వెంటనే ఫలితం వెల్లడవుతుంది.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ఇలా..

ఈ ఎన్నిక ఆసాంతం ప్రాధాన్యత క్రమంలో లభించే ఓట్లను బట్టే ఫలితం ఆధారపడి ఉంటుంది. సాధారణ ఎన్నికల మాదిరిగా కాకుండా ఈ ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలను వినియోగిస్తారు. ఇంతకు ముందున్న పాతకాలం నాటి పద్ధతే పోలింగ్‌లో అమలవుతుంది. ఓట్ల లెక్కింపులోను నానా తంటాలు పడాల్సిందే. గంటలకు బదులుగా రోజుల తరబడి ఓట్ల లెక్కింపు జరుగుతూనే ఉంటుంది.

(ఏలూరు/రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పట్టభద్రుల నియోజకవర్గ పోలింగ్ ముగిసింది. ఇక మిగిలిందల్లా ఓట్ల లెక్కింపు. ఓటర్లు తమకు నచ్చిన అభ్యర్థులకు ప్రాధాన్యత క్రమంలో ఓటు వేస్తూ వచ్చారు. అయితే ఇప్పుడు అసలు ప్రాధాన్యత ఓటు అంటే ఏమిటి, మొదటి ప్రాధాన్యత ఓటు, ఇతర ప్రాధాన్యత ఓట్లకు తేడా ఏమిటి, ఈ ఓట్లు ఏవిధంగా లెక్కిస్తారు. అసలు విజేతగా గెలవాలంటే అభ్యర్థికి రావాల్సిన ఓట్లు ఎన్ని. లెక్కింపు ప్రక్రియ ఎలా ఉంటుంది.. అనే ప్రశ్నలే అటు ఓటు వేసిన వారికి, ఇటు ఫలితం కోసం ఎదురుచూసే వారికి ఎన్నో సందేహాలు. మామూలుగా సాదాసీదాగానే ఎలక్ట్రానిక్ యంత్రాలతో కౌంటింగ్ పూర్తి చేస్తే గంటల వ్యవధిలోనే ఫలితం వస్తుంది. కాని ప్రాధాన్యత ఓటును పరిగణనలోకి తీసుకుని ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లను లెక్కించాల్సి ఉంది. మొదటి ప్రాధాన్యత ఓట్లు ఏ అభ్యర్థికి పోలైన ఓట్లలో 50 శాతానికి మించి వస్తాయో ఆ అభ్యర్థి గెలిచినట్టుగా తేలుస్తారు. ఓటు వేసిన వారి పోలైన ఓట్లలో చెల్లుబాటు అయిన ఓట్లనే పరిగణనలోకి తీసుకుంటారు. అలా ఆ ఓట్లలో సగాని కంటే ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా ఆ అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. ఉదాహరణకు మొత్తం పోలైన ఓట్లు 2 లక్షల 14 వేలు చెల్లుబాటు అయితే విజేతకు లక్షా ఏడువేల ఒక ఓటు వచ్చినా సరిపోతుంది. అలా వస్తేనే మొదటి ప్రాధాన్యత ఓటుతో ఈ అభ్యర్థి గెలుపొందిన ట్టు అవుతుంది. ఒకవేళ మొదటి ప్రాధాన్యత ఓటుతో ఈ మైలురాయి అధిగమించకపోతే ఎలిమినేషన్ ప్రక్రియ ప్రారంభి స్తారు. గెలుపు కోటాకు సరిపోయినన్ని ఓట్లు ఎవరికైతే వస్తాయో అప్పటి వరకు మిగతా ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. ఈ విధంగా మొదటి ప్రాధాన్యత ఓటు తర్వాత రెండవ ప్రాధాన్యత ఓటును లెక్కిస్తారు. అయితే పోటీ చేసిన అభ్యర్థుల్లో అందరికన్నా మొదటి ప్రాధాన్యత ఓటు తక్కువ వచ్చిన అభ్యర్థి నుంచి ఈ ఎలిమినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఆరోహణ క్రమంలో అభ్యర్థులు సాధించిన మొదటి ప్రాధాన్యత ఓట్ల జాబితాను తయారు చేస్తారు. ఇలా చివరి అభ్యర్థికి రెండో ప్రాధాన్యత ఓటు ఎవరు వేశారని ఓట్లను లెక్కించి ఆ ఓట్లను ఆయా అభ్యర్థులకు జమ చేస్తూ వస్తారు. ఇలా కింద నుంచి పైవరకు ఇదే తరహాలో లెక్కించి ఈ ఓట్లను కలుపుతూ చివరి అభ్యర్థులను ఎలిమినేట్ చేస్తూ వెళ్తారు. ఒకవేళ ద్వితీయ ప్రాధాన్యత ఓట్లలోను మెజార్టీ ఓట్ల మార్కుకు ఏ అభ్యర్థి చేరకపోతే తృతీయ ప్రాధాన్యత ఓట్లను గణించి ఆ అభ్యర్థికి జమ చేస్తూ వస్తారు. అప్పటికీకాకపోతే నాల్గవ ప్రాధాన్యం ఇలా మెజార్టీ మార్కు సంఖ్యను ఏదో ఒక అభ్యర్థికి చేరేవరకు ఎలిమినేట్ ప్రక్రియ అనేది సాగుతూనే ఉంటుంది. దాంతో మొదటి ప్రాధాన్యంతోపాటు ఇతర ప్రాధాన్యత ఓట్లు కీలకమే.

ఇప్పటికే ఎడతెగని ఉత్కంఠ

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో ఓటర్లు ఏ రకంగా స్పందించారనే ఉత్కంఠ అందరి అభ్యర్థుల్లోను నెలకొంది. తెలుగుదేశం అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం, పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు మధ్యే ఫలితం తేలబోతుందని భావిస్తున్నారు. సోమవారం జరిగే కౌంటింగ్ ప్రక్రియ సాధారణ ఎన్నికలకంటే భిన్నంగా ఉండబోతుండడంతో టెన్షన్ నెలకొంది. ఈసారి జరిగిన పోలింగ్ సరళిని బట్టి చూస్తే మొదటి ప్రాధాన్యతలోనే అభ్యర్థి గెలుపోటములు తేలబోతున్నాయని భావిస్తున్నారు. గత అనుభవాలను చూస్తే దాదాపు 14 గంటల తర్వాత గాని లెక్కింపు ప్రక్రియ ఒక కొలిక్కిరాదు. లేదా 36 లేదా 48 గంటలపాటు సాగే అవకాశం లేకపోలేదు.

దేవరపల్లి, అన్నదేవరపేటలో..
ప్రత్యేక పారిశుధ్య పనులు


స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్న డీపీవో శాంతామణి, పంచాయతీ సిబ్బంది

దేవరపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత పరిశుభ్రత అవసరమని, అప్పుడే రోగాల బారిన పడకుండా ఉంటామని డీపీవో శాంతమణి అన్నారు. దేవరపల్లి పంచాయతీ పరిధిలో శనివారం ప్రత్యేక పారిశుధ్య పనులను నిర్వహించగా, డీపీవో, కొవ్వూరు డివిజన్ పంచాయతీ అధికారి వై.అమ్మాజీ వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డులకు తరలించాలని సూచించారు. వీరితోపాటు పంచాయతీ కార్యదర్శి ఎస్.రవికిషోర్, పంచాయతీ విస్తరణ అధికారి రాజారావు, పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, తదితరులు ఉన్నారు.

తాళ్లపూడి: గ్రామాల్లో శానిటేషన్‌పై పంచాయతీ సిబ్బంది, కార్యదర్శులు నిరంతరం దృష్టిపెట్టాలని డీపీవో వీ.శాంతామణి అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం అన్నదేవరపేటకు విచ్చేసి తడి, పొడి చెత్త సేకరణపై ఆరా తీశారు. ఆమెవెంట డీఎల్‌పీవో అమ్మాజీ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం

తాళ్లపూడి, మార్చి1(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులకు శనివారం ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద నిర్వహించారు. ఎస్‌ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. కొవ్వూరు రూరల్ సీఐ విజయబాబు ముఖ్య అతిథిగా విచ్చేసి పోలీస్‌స్టేషన్ లోపల జరిగే విధివిధానాలు, చట్టంలో మహిళలకు కేటాయించిన రూల్స్ అమలు గురించి తెలిపారు. దీనిలో భాగంగా విద్యార్థులకు వ్యకృత్వ పోటీలు నిర్వహించి, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల విద్యార్థులు, మహిళాపోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్‌ఐ

పల్లంట్లలో లక్ష్మీగణపతి హోమం


శివాలయం వద్ద హోమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

దేవరపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం పల్లంట్లలోని రాజరాజేశ్వరి సమేత దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో రుద్రసహిత లక్ష్మీ గణపతి హోమాన్ని నిర్వహించారు. ఈ హోమం పీటల మీద ఆలయ కమిటీ సభ్యులు బలుసు సత్యనారాయణ, విజయలక్ష్మి, దంపతులు, బిక్కిన వెంకటకృష్ణ, కమల దంప తులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సృజనా శర్మ, రామకృష్ణశర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ముగింపు సందర్భంగా ఉదయం 11 గంటల నుంచి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఆలయ కమిటీ సభ్యులు కొయ్యలమూడి సురేంద్రనాథ్, ఎం. శ్రీనివాస రావు, కరుటూరి పానయ్య, నలమాటి జానకి రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గంతో సమయం, డబ్బు ఆదా

కొవ్వూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడంతో సమయం, డబ్బు ఆదా అవుతుందని కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం. అనూరాధ అన్నారు. కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో శనివారం ఇన్సూరెన్సు న్యాయవాదులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 8వ తేదీన కోర్టు ప్రాంగణంలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఇన్సూరెన్సు కేసులలో మధ్యవర్తిత్వం ద్వారా కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకునేలా చూడాలన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. చలపతి, ఉప్పల కృష్ణారావు, తాడేపల్లి ప్రభాకర్, కె.నరసింహారావు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.


ఇన్సూరెన్సు న్యాయవాదులతో మాట్లాడుతున్న కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి అనురాధ

వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా రమేష్‌బాబు


మాజీమంత్రి చెల్లుబోయినను కలిసిన రమేష్‌బాబు

కొవ్వూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా కొవ్వూరు పట్టణానికి చెందిన కంట మణి రమేష్‌బాబు నియమితులయ్యారు. శనివారం బొమ్మూరు పార్టీ కార్యాలయంలో మాజీమంత్రి, జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కారింకి వెంకటేశ్వరరావు, కొడవటి దేవ, చిట్టూరి అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

గోదావరి నదిలో గుర్తుతెలియని
మృతదేహం లభ్యం

కొవ్వూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని పట్టణ పోలీసులు గుర్తించారు. శనివారం గామన్‌బ్రిడ్జి 13వ స్తంభం వద్ద మృతదేహం తేలియాడుతుందనే సమాచారం రావడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానిక జాలర్ల సహాయంతో మృతదేహాన్ని నదిలోంచి బయటకు తీయించారు. అనంతరం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మృతునికి సంబంధించి ఎలాంటి వివరాలు తెలియరాలేదన్నారు. ఫ్యాంటు, షర్ట్ ధరించి ఉన్నాడని, వయస్సు సుమారు 60 సంవత్సరాలు ఉంటుందన్నారు. ఆచూకీ తెలిసినవారు కొవ్వూరు పట్టణ పోలీస్‌స్టేషన్ 94407966622, 08813-231100, 9154875583 నెంబర్లకు సమాచారం అందజేయాలని సీఐ పి. విశ్వం తెలిపారు.



గోపాలపురంలో 93.49 శాతం పింఛన్ల పంపిణీ

గోపాలపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో 93.49 శాతం సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ జరిగిందని ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. 18 గ్రామ పంచాయతీల పరిధిలో 8,987 మంది పింఛన్‌దారులు ఉండగా, వారిలో 84.40 మందికి రూ. 3 కోట్ల 40 లక్షల 37 వేల 500 పంపిణీ చేయడం జరిగిందన్నారు.

ఇంటర్ ‘మొదటి’ పరీక్షలు ప్రారంభం


కొవ్వూరులోని ప్రభుత్వ కళాశాల వద్ద విదార్థులు


నిడదవోలులో పరీక్ష కేంద్రంలోనికి వెళ్లేందుకు ఉన్న విద్యార్థులు


తాళ్లపూడిలో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

కొవ్వూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు పట్టణం, మండలంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. పట్టణ, మండలంలో 478 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 448 మంది మాత్రమే హాజరయ్యారు, 31 మంది రాలేదు. మొదటిరోజు సీసీ కెమెరాల పర్యవేక్షణ, పోలీసు బందోబస్తు మధ్య జరిగాయి. ఉదయం 8-30 గంటలకు పట్టణ సీఐ పీ. విశ్వం ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రానికి పంపించారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో 302 మందికి గాను 288 మందికి హాజరవ్వగా, 14 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 176కి 159 మంది హాజరవ్వగా 17 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

నిడదవోలు: నిడదవోలు పట్టణం,మండలంలో శనివారం నుంచి ఇంటర్ మొదటిసంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. నిడదవోలు, సమిశ్రగూడెం కేంద్రాల వద్ద అధికారులు కట్టుది ట్టమైన ఏర్పాట్లు చేశారు. అలాగే ఐదు పరీక్ష కేంద్రాల్లోనూ నిర్వహించారు.

గోపాలపురం: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈనెల 15వ తేదీ వరకు జరగనున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలలో 309 మంది విద్యార్థులు మొదటి రోజు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, వారిలో 296 మంది హాజరవ్వగా, 13 మంది గైర్హాజరయ్యారు. అలాగే గౌతమి జూనియర్ కాలేజీలో 287 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 16 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 271 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ కేఎంకేఆర్ కుమారస్వామి తెలిపారు.

తాళ్లపూడి: వేగేశ్వరపురం జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమ య్యాయి. మొదటిరోజు 301 మంది విద్యార్థులకు గాను 280 మంది హాజరయ్యారని ఇన్‌చార్జి ప్రిన్స్‌పాల్ గౌరీనాథ్ తెలిపారు. అలాగే కరిబండి కళాశాల, విశ్వాశం కళాశాల, అన్నదేవరపేట కళాశాలలోనూ పరీక్షలు జరిగాయి.

చాగల్లు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలకు 136 మంది హాజరైనట్టు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ కేపీ పావని తెలిపారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా దేవి వ్యవహరించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేశారు.

యజ్ఞంలా పారిశుధ్య నిర్వహణ జరగాలి : డీపీవో


కుమ్మరికుంటలో తడి, పొడి చెత్త పై అవగాహన కల్పిస్తున్న శాంతకుమారి

గోపాలపురం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణ యజ్ఞంలా జరగాలని జిల్లా పంచాయతీ అధికారిణి శాంతకుమారి అన్నారు. ప్రత్యేక పారిశుధ్య పనుల్లో భాగంగా శనివారం కుమ్మరకుంటలో జరుగుతున్న స్పెషల్ శానిటేషన్ పనులను ఆమె పరిశీలించారు. దీనిలో భాగంగా తడి, పొడి చెత్త నిర్వహణపై మహిళలకు అవగాహన కల్పించారు. పంచాయతీ అధికారిణి అమ్మాజీ, ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి అనురాధ, సచివాలయ సిబ్బంది, ఎంఆర్‌పీ బాబూరావు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని ఎంపీడీవో వీఎస్ రామారావు చెప్పారు. శనివారం వేలివెన్నులో శాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డు పనితీరును పర్యవేక్షించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామంలో చెత్త సేకరించేటపుడు తడి, పొడి చెత్తను వాటికి కేటాయించిన స్థలంలో వేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కెఎస్‌ఆర్ శర్మ, పంచాయతీ కార్యదర్శి శేషుబాబు, తదితరులు పాల్గొన్నారు.


వేలివెన్ను వద్ద వర్మీకంపోస్టు తయారీ పిట్‌లను పరిశీలిస్తున్న ఎంపీడీవో

అలరించిన సంగీత కచేరి


ఉండ్రాజవరంలో కచేరి నిర్వహిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఉండ్రాజవరంలో బాలత్రిపుర సుందరి సమేతగోకర్ణేశ్వరస్వామి వారి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ముగింపు కార్యక్రమాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా టీటీడీ కళాకారిణి, ఆల్ ఇండియా రేడియో ఆర్టిస్ట్ ఏలూరుపాటి సుబ్బలక్ష్మీచే సంగీత కచేరి నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు.

భాష్యం స్కూల్‌లో విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన


తయారు చేసిన ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

దేవరపల్లి, మార్చి1 (ఆంధ్రజ్యోతి): స్థానిక భాష్యం స్కూల్‌లో విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా విద్యార్థులు పలు ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించారు. అయా ప్రాజెక్టులు ఉపాధ్యాయులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పేరయ్య నాయుడు మాట్లాడుతూ ప్రపంచ స్థితిగతులను మార్చే శక్తి శాస్త్ర, సాంకేతిక రంగాలకు మాత్రమే ఉందన్నారు. విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో భాష్యం స్కూల్ వైస్‌ప్రిన్సిపాల్ సబాన, ఉపాధ్యాయులు కీర్తిరాణి, రత్నకుమారి, అప్పారావు, ఉదయ్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

డీపీవోలో ఉచిత వైద్య శిబిరం

రాజమహేంద్రవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలోని మహిళా సిబ్బంది కోసం విజన్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సౌజన్యంతో శనివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు.

ఎనీటైమ్ మూత

- నెల రోజులుగా పనిచేయని పోస్టాఫీస్ ఏటీఎం
- పట్టించుకోని అధికారులు

నిడదవోలు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది పోస్టాఫీస్ సేవలపైనే ఆదారపడి ఉన్నారు. ఉత్తరాల బట్వాడా సేవలే కాకుండా బ్యాంకింగ్ సేవలూ ఖాతాదారులకు అందుతున్నాయి. ముఖ్యంగా పేద వర్గాల నుంచి మొదలుకొని చిరుద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు సైతం తమ ఆర్థిక లావాదేవీలన్నీ పోస్టాఫీస్ ద్వారానే నిర్వహిస్తుంటారు. అలాంటి పోస్టాఫీస్‌కు చెందిన ఏటీఎం పనిచేయకున్నా... పోస్టల్ శాఖాధికార్లకు చీమకుట్టినట్టయినా లేదు. వివరాల్లోకి వెళితే ... నిడదవోలు పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న పోస్టాఫీస్ ఏటీఎం గత నెలరోజులుగా మూతపడి ఉంది. నగదు లావాదేవీలకు 24 గంటలూ సేవలందిస్తామంటూ బోర్డు అయితే దర్శనం ఇస్తుంది తప్ప ... ఆచరణలో సాధ్యం కావడం లేదు. దీంతో ఖాతాదారులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. దీంతో ఇతర బ్యాంకుల ఎటీఎంల వద్దకు వెళ్లి నగదును డ్రా చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. అయితే నెలలో మూడుసార్లు మాత్రమే పరిమితి ఉంటుంది. అది ఒకవేళ పూర్తయితే ఇక... ప్రతి ట్రాన్‌జాక్షన్‌కి రూ. 26 అదనపు రుసుము పడుతోంది. దీంతో పోస్టాఫీస్ సేవలు ఖాతాదారులకు అదనపు భారంగా మారుతోంది. ఇకనైనా పోస్టాఫీస్ ఉన్నతాధికార్లు స్పందించి ఏటీఎం తెరిచేలా చూడాలని ఖాతాదారులు కోరుతున్నారు. దీనిపై నిడదవోలు పోస్ట్‌మాస్టర్ జీ.శ్రీనివాసరావును వివరణ కోరగా ఏటీఎంలో నగదును లోడింగ్ చేసే ఏజీఎస్ ఏజెన్సీ వాళ్లు రాకపోవడంతో నగదు వేయని కారణంగా మూసివేయవలసి వచ్చిందని తెలిపారు. ఈ విషయాన్ని పోస్టాఫీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు.



నిడదవోలులో మూసివున్న పోస్టాఫీస్ ఏటీఎం

మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

కొవ్వూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్‌ల వర్గీకరణ కోసం మూడు దశాబ్దాలుగా మాదిగలు చేస్తున్న పోరాటం చరిత్రలో నిలుస్తుందని డీవీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొడమంచిలి విజయకుమార్ అన్నారు. శనివారం కొవ్వూరు మెరకవీధిలో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రావ్ విగ్రహం వద్ద మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి విజయ్‌కుమార్ పూలమాల వేసి నివాళి అర్పించారు. వర్గీకరణ పోరాటంలో అశువులు బాసిన అమరవీరులకు క్యాండిల్స్‌తో అంజలి ఘటించారు. డీవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చెట్టే రాజు మాట్లాడుతూ వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలకు రుణపడి ఉం టామన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమరవీరులకు రూ. 5 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా అం దించడంపై సీఎం రేవంత్‌రెడ్డి, దామోదర రాజనరసింహకు కృతజ్ఞతలు తెలిపారు. పెనుమాక జయరాజు, పెద్దాడ ఏసు బుజ్జి, చీలిప్రసాద్, ఎం. అచ్చిబాబు, ఎం. కిషోర్, తదితరులు పాల్గొన్నారు.


జగ్జీవన్‌రావ్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న డీవీఎఫ్ నాయకులు, తదితరులు

తాళ్లపూడి: పెద్దేవంలో మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంఆర్‌పీఎస్ 30 సంవత్సరాల ఉద్యమంలో మాదిగ జాతి ఉనికిని కాపాడుకునే పోరాటంలో భాగంగా మలకపల్లికి చెందిన సిర్రా నాగేశ్వరరావుతో పాటు వివిధ ప్రాంతాలలో పలువురు అసువులు బాసారని తెలుపుతూ, వారి త్యాగాల ఫలితమే ఎస్సీ వర్గీకరణ ఫలాలు మాదిగ జాతికి అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు గెద్దం వినోద్, అయినపర్తి రాజేంద్రప్రసాద్, తిగిరిపల్లి వేణు, గెద్దం విజయ భాస్కర్ ముప్పిడి దానియేలు, ఎంఆర్‌పీఎస్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


సంస్మరణ దినోత్సవంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు

రామకృష్ణ పరమహంస జయంతి


నిడదవోలులో జయంతిని నిర్వహిస్తున్న భక్తులు

నిడదవోలు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో శనివారం భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస 190వ జయంతిని ఘనంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని విష్ణుసహస్ర నామం, లలితా పారాయణం, తదితర పూజలు చేశారు. రామకృష్ణ సేవా సమితి ప్రతిని ధులు సాగర్, రాంబాబు, సోమేశ్వరరావు, మనోహర్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అంగవాడీ సిబ్బందికి క్రీడా పోటీలు

చాగల్లు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకుని మండలంలోని అంగన్‌వాడీ సిబ్బందికి శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలు నిర్వహించారు. కబడ్డీ, కోకో ఆటల పోటీలు జరిగాయి. స్థానిక హైస్కూల్ పీడీ జే. విజయలక్ష్మి పర్యవేక్షించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లుపి. పద్మావతి, జి. శిరీషా, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. విజయం సాధించిన వారు సోమవారం రాజమహేంద్రవరంలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. క్రీడల పట్ల మహిళలు ఆసక్తి కలిగి ఉండాలన్నారు.

ప్రాథమిక స్థాయి నుంచే..
క్రీడాకారులు తయారుకావాలి

- రాష్ట్ర కబడ్డీ జట్టు సభ్యుడు శ్రీకాంత్


శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న ఉషోదయ స్కూల్ యాజమాన్యం

నల్లజర్ల, మార్చి1 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయి నుంచే క్రీడాకారులు తయారు కావాల్సిన అవసరం ఎంతయినా ఉందని రాష్ట్ర కబడ్డీ జట్టు క్రీడాకారుడు జీ.శ్రీకాంత్ విద్యార్థులకు సూచించారు. గత నెల 20 నుంచి 23 వరకు కటక్‌లో జరిగిన 71వ జాతీయ కబడ్డీ పోటీలలో పాల్గొన్న శ్రీకాంత్‌ను ఆయన స్వగ్రామం అనంతపల్లిలో ఉషోదయ పబిక్ స్కూల్ యాజమాన్యం శనివారం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన కబడ్డీలో మెలకువలను వివరించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యా ర్థులు విభిన్న ఆలోచనలు,క్రియేటివిటీతో ముందుకు పోవాలన్నారు.బాల్యం నుంచే విభిన్నంగా ఆలో చించే అలవాటును పెంచుకోవాలన్నారు.జీవితంలో ఏది సాధించాలనుకుంటున్నారో దాన్ని పొందే వరకు విశ్రమించకుండా కృషి చేయాలన్నారు. చక్కగా చదువుకొని మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ మీసాల శ్రీనివాస చెల్లారావు, ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, టీచర్లు , తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

శ్రీకాకుళం జిల్లా శ్రీకాకుళం కాపురస్తులు వెరుకూరి అప్పారావు S/o సత్యం అను నేను ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా. కొవ్వూరులోని ఆర్.ఎస్.నెం.257/2ఎ, 257/2బిరులో య1-38ట్లు భూమి కలదు. సదరు భూమిని అమ్మివేయాలనే ఉద్దేశ్యంతో సదరు పైన తెల్పిన భూమి యొక్క దస్తావేజులు డనెం.3666/2005 తీసుకొని 27-02-2025వ తేదిన తాళ్ళపూడి వచ్చి జిరాక్స్ తీయించుకొనటుకు వెళ్ళుచుండగా మార్గమధ్యలో ఎక్కడో పడిపోయినవి. నేను ఎంత వెతికినను దొరకలేదు. ఏవరికైనా దొరికిన యెడల పై అడ్రాస్‌కు తెలియజేయగలరు.

దస్తావేజులు పోయినవి

శ్రీకాకుళం జిల్లా శ్రీకాకుళం కాపురస్తులు వెరుకూరి లక్ష్మీ నరసమ్మ W/o అప్పారావు అను నేను ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా. కొవ్వూరులోని ఆర్.ఎస్.నెం.94/1, 96/1కులలో య3-95ట్లు భూమి కలదు. సదరు భూమిని అమ్మివేయాలనే ఉద్దేశ్యంతో సదరు పైన తెల్పిన భూమి యొక్క దస్తావేజులు తీసుకొని 27-02-2025వ తేదిన తాళ్ళపూడి వచ్చి జిరాక్స్ తీయించుకొనటుకు వెళ్ళుచుండగా మార్గమధ్యలో దస్తావేజులు ఎక్కడో పడిపోయినవి. నేను ఎంత వెతికినను దొరకలేదు. ఏవరికైనా దొరికిన యెడల పై అడ్రాస్‌కు తెలియజేయగలరు.